జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 20 విశాఖపట్నం సోమవారం 04 అక్టోబరు 2021 8 పేజీలు వెల : 5.00

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

బద్వేల్ ఉప ఎన్నికలో..

పోటీ చేయబోం:టీడీపీ

పోటీ విషయంలో క్లారిటీ ఇచ్చిన అధిష్టానం..

బద్వేల్
Badvel

అమరావతి, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: బద్వేల్ ఉప ఎన్నికపై టీడీపీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఉప ఎన్నికలో పోటీ చేయబోమని తేల్చి చెప్పింది. ఈ మేరకు టీడీపీ తరఫున ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం నాడు తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బద్వేల్ ఉప ఎన్నిక, ఏపీలో రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, తొలుత బద్వేల్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని బరిలోకి దించాలని భావించిన టీడీపీ.. ఆ తరువాత వెనక్కి తగ్గింది. పోటీపై పార్టీ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో.. సుదీర్ఘంగా చర్చించారు. తుదకు బద్వేల్ బరి నుంచి తప్పుకోవాలని టీడీపీ నిర్ణయించింది. చనిపోయిన ప్రజా ప్రతినిధి కుటుంబం నుంచి అభ్యర్థి పోటీలో ఉంటే.. సాంప్రదాయం ప్రకారం పోటీ చేయకూడదని పొలిట్ బ్యూరో సమావేశంలో టీడీపీ నేతలు నిర్ణయించారు. పొలిట్‌బ్యూరో సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని సమావేశం అనంతరం టీడీపీ అధికారికంగా ప్రకటించింది. జనసేన పార్టీ కూడా బద్వేల్ ఉప ఎన్నిక బరినుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతపురంలో జరిగిన జనసేన బహిరంగ సమావేశంలో ఈ నిర్ణయాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రకటించారు. చనిపోయిన ఎమ్మెల్యే గౌరవార్థం పోటీ నుంచి తప్పుకుంటున్నామని పవన్ స్పష్టం చేశారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి చెందిన వారికే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇదిలాఉంటే.. బద్వేల్ ఉపఎన్నికలో పోటీ చేసేందుకు బీజేపీ సై అంటోంది. **(మిగతా 2లో..)**

భూదేవి పేట భేష్.. అభినందించిన ప్రధాని మోదీ

గజపతినగరం,అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: విజయనగరం జిల్లాలో మంచినీటి సదుపాయం, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో మండలంలోని భూదేవి పేట స్పందన కలిగిన గ్రామంగా ఎంపికైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ కె.శివానంద కుమార్ తెలిపారు. శనివారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామంలో ఉన్న 144 కుటుంబాలకు పూర్తిగా మంచి నీటి కొళాయి కనెక్షన్ ఇచ్చామని తెలిపారు. **(మిగతా 2లో..)**

మమత బెనర్జీ ఘన విజయం

కోల్‌కతా అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: పశ్చిమ బెంగాల్‌లోని భవానీపూర్ శాసన సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో టీఎంసీ అభ్యర్థి మమత బెనర్జీ ఘన విజయం సాధించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆమె తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ప్రియాంకపై 58 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఈ గెలుపుతో మమత ముఖ్యమంత్రి పదవికి చిక్కులు తొలగినట్లు అయింది. 2011 శాసన సభ ఎన్నికల్లో వామపక్షాలను మమత బెనర్జీ నేతృత్వంలోని **(మిగతా 2లో..)**

దివంగత డా.గంగిరెడ్డికి పులివెందుల ఘాట్‌లో...

జగన్ ఫ్యామిలీ ఘన నివాళి

కడప, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: కడప జిల్లా దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ప్రథమ వర్ధంతి ఇవాళ పులివెందులలో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధి తోటలో ఉన్న డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్ వద్ద జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ తమ నివాళులర్పించింది. సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, ఇతర వైఎస్ కుటుంబీకులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం పులివెందులలో ఉన్న భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ఈసీ గంగిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు వైఎస్ కుటుంబ సభ్యులందరూ హాజరయ్యారు. దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల డాక్టర్‌గా పులివెందుల ప్రాంతంలో గుర్తింపు పొందారని ఈ సందర్భంగా ఆయన సేవల్ని స్మరించుకున్నారు. ఆయన హస్తవాసి తగిలితే ఎంతటి రోగమైనా ఇట్టే నయమవుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకమన్నారు. ఇలాఉండగా, నేటి నుంచి రెండు రోజులపాటు పులివెందుల నియోజకవర్గం పర్యటనలో **(మిగతా 2లో..)**

చిత్తూరు జిల్లాలో రూ.500 కోట్ల..

భారీ భూ కుంభకోణం

చిత్తూరు,అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: చిత్తూరు జిల్లాలో భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చింది. 2,300 ఎకరాలకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆన్‌లైన్, వెబ్‌ల్యాండ్‌కు ఎక్కించారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఇప్పటిదాకా ఆరుగురిపై కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తిరుపతి సీఐడీ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ భూముల విలువ రూ.500 కోట్లు ఉంటుందని అంచనా. యదమరి మండలం గొల్లపల్లి రిటైర్డ్ వీఆర్‌ఓ గణేష్ పిళ్లై ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారి. జూలై 01, 2009లో ఒకే రోజు ఆన్‌లైన్‌లో ఎక్కించి అక్రమాలకు పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా సోమల మండలం పెద్ద ఉప్పరపల్లిలో సర్వే నెంబర్ 459లో 45.42 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా.. రాజన్, ధరణి, మధుసూధన్‌లు ఆన్‌లైన్‌లో 160.09 ఎకరాలు చూపించి అక్రమాలకు పాల్పడ్డారు. ఈ అక్రమాలపై సోమల తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి మే 29, 2020లో పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. పెద్ద పంజానీ మండలంలో కూడా 2015లో తహశీల్దార్ శ్రీదేవి సహాయంతో నిందితులు అక్రమాలకు పాల్పడ్డారు. సీసీఎల్‌ఏ నివేదిక ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. ఇదే పేర్లతో 14 మండలాల్లో 93 సర్వే నంబర్స్‌లలో 2,300 ఎకరాలకు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారు. ఈ కుంభకోణంలో గణేష్ పిళ్లైతో పాటు, అతని కుమారులు మధుసూధన్, సుధ, కోమలి, అడవి రమణ మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశాము. గణేష్ పిళ్లై కూతరు ధరణి పరారీలో ఉంది' అని సీఐడీ డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

పవన్ బెదిరింపులకు జగన్ ప్రభుత్వం భయపడదు: కొడాలి నాని

అమరావతి,అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బెదిరింపులకు జగన్ ప్రభుత్వం భయపడదని మంత్రి కొడాలి నాని హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పవన్ జీవితంలో జగన్‌ను ఓడించలేరని అన్నారు. కోర్టు ఉత్తర్వులను అడ్డుపెట్టుకొని కొందరు పెద్ద నిర్మాతలు.. విచ్చలవిడిగా బెనిఫిట్ షోలు వేసి ప్రజల డబ్బు దోచుకున్నారని విమర్శించారు. చిన్న సినిమాలు బతకాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని కొడాలి నాని తెలిపారు.

స్నేహా గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్స్
www.snehaclub.org
www.snehanews.com
www.ambedkartv.org
www.ambedkarrajaneethi.com

మిత్రులారా !

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గారి 1956 మార్చ్ 18 నాటి ఆగ్రా ప్రసంగం మరియు ఎకనమిక్ విజన్ స్ఫూర్తి తో, వారి ఆశయాల సాధనకు తన వంతు బాధ్యతగా 2001 లో డాక్టర్ కటికల శివ భాగ్యారావు IRS గారు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే తన పే బ్యాక్ టు సొసైటీ దృక్పథంతో స్నేహా క్లబ్ ను మొదలు పెట్టి రెండు రాష్ట్రాల్లో ఉన్న సుమారు 2 లక్షల మంది బహుజనులు ఆచరణాత్మక అంబేడ్కరిజం వైపు నడిచే విధంగా ఉత్సాహపరిచారు. ఈ 20 సంవత్సరాల్లో సుమారు12 కోట్ల విరాళాలతో 17 లక్షల మందికి ప్రత్యక్షంగా విద్యాభివృద్ధికి సహాయ పడి 3 వేల మంది ఉద్యోగాలు పొందేలా కృషి చేసింది. 2001లో స్నేహా క్లబ్ తో మొదలై 2020 వరకు 16 సంస్థలు గా ఎదిగి పారదర్శకంగా దిగ్విజయంగా నడుస్తున్నాయి. బహుజనులఅభివృద్దే అంబేడ్కరిజం. అంబేడ్కరిజాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ దిగువ తెలిపిన సంస్థల్లో స్వచ్ఛందంగా సభ్యులుగా గానీ సపోర్టర్స్ గా గానీ చేరడానికి ఇదే మా ఆహ్వానం.

1. స్నేహా క్లబ్: మనల్ని మనం గౌరవించుకుంటూ ఏ ఇతర కులాన్ని గానీ, మతాన్ని గానీ, వ్యక్తిని గానీ అగౌరవ పరచకుండా /కించపరచకుండా డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గారు చెప్పిన పే బ్యాక్ టు సొసైటీ కి కృషి చేయడం.
2. స్నేహా మ్యారేజ్ బ్యూరో: మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాల మీదే ఆధారపడుతున్న ఈ సమాజంలో తక్కువ ఖర్చుతో స్నేహా సభ్యులకు మరియు ఇతరులకు వివాహ సంబంధ బాంధవ్యాలను పరిచయం చేయడం. వివాహం నిశ్చయము అయ్యాక ఆయా కుటుంబాలు హాస్టల్ విద్యార్థులకు / పేద విద్యార్థులకు పుస్తకాలు గానీ, మంచి ఆహారాన్ని అందించేలా చూడడం.
3.స్నేహా వాణి: స్నేహా క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాలను మరియు సభ్యులకు సంబంధించిన కవితలు, గేయాలు ప్రచురించి సాహిత్యం వైపు, సేవ వైపు ప్రోత్సహించడం కోసం ప్రారంభించిన తెలుగు మాసపత్రిక.
4.స్నేహా మ్యాక్స్: ప్రజల నుంచి అధిక వడ్డీకి అంటే 12 % నుండి 16% వరకు డిపాజిట్లు సేకరించి పేద ప్రజలకు అదే వడ్డీ రేటుతో అప్పులు ఇచ్చి వారి ఆర్థిక అభివృద్ధికి సహకరించడం.
5. స్నేహా స్ఫూర్తి చిట్ ఫండ్స్ : సభ్యులకు ఇచ్చే లాభాలను సభ్యులకు ఇస్తూ కంపెనీకి వచ్చే లాభాలను సేవా కార్యక్రమాలకు వాడుతున్న ప్రపంచ ఏకైక సంస్థ.
6. స్నేహా టీవీ : వికేంద్రీకరణ పద్ధతిలో ప్రతి ఒక్కరినీ మీడియా అధిపతులుగా చేసి ప్రజల పక్షాన నిలుస్తున్న ఏకైక టీవీ ఛానల్.
7. ప్రజాపాలన: విలేకరులను ఆయా ప్రాంతాలలో వికేంద్రీకరణ పద్ధతిలో పత్రికాధిపతులుగా చేయాలనే సంకల్పంతో ప్రారంభించిన తెలుగు దిన పత్రిక.
8. అంబేడ్కర్ టీవీ (మాస్టర్ కీ టీవీ ఛానల్) : ప్రపంచంలో మొట్టమొదటి సారిగ వికేంద్రీకరణ పద్ధతిలో ప్రత్యేకంగా బహుజనుల సమస్యల మీద ఏర్పాటు చేస్తూ ప్రతి బహుజనుడిని భాగస్వామిని చేస్తున్న ఏకైక మీడియా సంస్థ.
9. రైతు ఉత్పత్తి సంస్థ (ఫార్మర్స్ ప్రోడక్ట్స్ కంపెనీ): చిన్న, సన్నకారు రైతులయిన బహుజనులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను సరసమైన ధరలకే అందించి వారి ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకే అందేలా చేయడం.
10. మెర్కాన్ ఇండియా: సభ్యులందరికి డిస్కౌంట్ ధరలకే మెడిసిన్స్, ఇతర వైద్య సేవలను వారి ఇంటివద్దకే (డోర్ స్టెప్) అందించడం.
11. 9స్టార్ ప్రొడక్ట్స్: నాణ్యమైన పచ్చళ్ళు మరియు ఇతర ఆహార ఉత్పత్తులను ఆన్ లైన్ లో బుక్ చేసుకుంటే సరసమైన ధరలకే అందించబడును.
12. మై డాక్టర్ ఛాయిస్: తెలుగు రాష్ట్రాలలో గల డాక్టర్లను అందరినీ వారి వారి విభాగాల వారిగా ఆయా ప్రాంతాల వారిగా డాక్టర్స్ వివరాలను వెబ్ సైట్ లో పొందుపరచడం.
13. స్నేహా హౌసింగ్: సభ్యులందరికీ మార్కెట్ ధరకంటే తక్కువ ధరకే ఇళ్లను (హౌసెస్) , ఇళ్ల స్థలాల (హౌసింగ్ ప్లాట్స్)ను అందించడం.
14. అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్: బహుజన సమస్యలను డిమాండ్స్ రూపంలో మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిల్లో చర్చా కార్యక్రమాలు నిర్వహించి బహుజనుల్లో అవగాహన కల్పించడం. ఈ డిమాండ్స్ ను ఒప్పుకునే వారిని సభ్యులుగా చేర్చుకుని డిమాండ్స్ సాధన కోసం ప్రభుత్వం మీద ప్రెజర్ గ్రూప్‌గా తయారు కావడం.
15. బహుజన బిజినెస్ పేజెస్ (ఎల్లో పేజెస్): బహుజన సాహిత్యం మీద రచయితలు రాసిన, ముద్రించిన పుస్తకాలు, బహుజనులు తయారు చేసిన వస్తువులు, బహుజనుల హీరోల , బహుజన డాక్టర్స్, లాయర్స్, బిల్డర్స్, ఆర్కిటెక్ట్, ఆర్టిస్ట్స్ సేవల వివరాలు, ఎన్జీవోలు, ప్రభుత్వ జీవో లు తదితర అంశాలను వెబ్ సైట్ లో పొందుపరచడం.
16. బహుజన బజార్: బహుజన సాహిత్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికి వారి ఇంటికే చేర్చాలనే సంకల్పంతో అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లాగా బహుజన సాహిత్యాన్ని ఆన్ లైన్ లో బుక్ చేసుకుంటే వారికి చేర్చడం. అదే విధంగా బహుజనులు తయారు చేసే ప్రొడక్ట్స్ ను బహుజనులు సపోర్ట్ చేసుకుంటే బహుజన వ్యాపారుల అభివృద్ధితో పాటు బహుజనుల ఐక్యత దేశాభివృద్ధి సాధించవచ్చు.

స్నేహా గ్రూప్ ఆఫ్ ఆర్గనైజేషన్స్

www.bahujanabusinesspages.com www.bahujanabazar.in

స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలి

క్యాండిల్ ర్యాలీ దళిత సంఘాల నేతలు డిమాండ్

విశాఖపట్నం, అక్టోబర్ 3(ప్రజాపాలన బ్యూరో): విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ను తక్షణమే అపాలని దళిత సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం నగరం లోని ఎల్. ఐ. సి బిల్డింగ్ దగ్గర లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీని నిర్వహించారు. అంతకముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులుఅర్పించారు. అనంతరం దళిత సంఘాల ప్రతినిధులు మీడియా తో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగం తో ఎంతో మంది అనేక మైన త్యాగాల ఫలితంగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగిందన్నారు. లాభాలా బాటలో నడుస్తున్న కంపెనీ ని, అనేక కుయుక్తులు పన్ని నష్టాల్లో ఉందని బి. జె. పి పాలకులు కుంటి సాకులు చెబుతున్నారని స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమకారులు ఆరోపించారు. ప్రజా కర్షక, కార్మిక విధానాలకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వానికి ఘోరీ కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బి. జె. పి ని హెచ్చరించారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ అంబేద్కర్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉన్న గురజాడ అప్పారావు విగ్రహం మీదుగా సిరిపురం జంక్షన్, జి. వి. ఎం. సి గాంధి విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ లో కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ వివిధ రకాల స్లొగన్స్ తో హోరెత్తించారు. ఈ నిరసన ర్యాలీ లో పూలే అంబేద్కర్ రాజనీతి రాష్ట్ర కమిటీ సభ్యులు,ప్రముఖ దళిత నేత మాటూరి శ్రీనివాస రావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, సి. హెచ్. నరసింగరావు, వై.ఎస్. ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు వై. మస్తానప్ప, ఇతర నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పడాల రమణ, జి. వామనమూర్తి, ఇతర నాయకులు, దళిత సంఘాల నుండి బి. కల్యాణరావు(ఆర్. పి. ఐ) బి. అప్పారావు, జి. రాంబాబు, మండేసత్యనారాయణ(డి.హెచ్.పి.ఎస్), పట్టా రమేష్ బాబు,,కోటేశ్వరరావు (ఏఐడిఆర్ఎఫ్), ఆర్. పి. రాజు(కె. వి. పి. ఎన్),సోడదాసి సుధాకర్(కాంగ్రెస్),పాల్తేటి పెంటరావు(దళితసేన), యమ్. రవిసిద్దార్ధ, చిన్నారావు, దుర్గారావు(భీమ్ సేన), %శ్రీ% చింతాడ సూర్యం(డి.బి.ఎస్), కె. రాములప్పడు, తులసీ రావు(రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున) ఎల్.బి. రాజేంద్రప్రసాద్(%ξ౧%. ప్రిన్సిపాల్) %ణతీ%. వి. ఆర్. ప్రసాద్, విజ్ఞానంద్, రాంప్రభు, ఎం. కిరణ్ కుమార్(నావెల్ డాక్ యార్డ్), మహిళల తరుపున నాగమణి, సరస్వతి ఇంకా ఇతర నాయకులుఐ గురుమూర్తి(ఏ. ఎం.ఎస్ అధ్యక్షులు), అంబేద్కర్ రాజకీయ చైతన్య వేదిక నుండ మల్లికార్జున, సరస్వతి, పాస్ పోర్ట్ పార్ట్మెంట్ నుండి రామకృష్ణ, జి.వి.ఎం.సి నుండిఈశ్వరరావు, మోహన్ బాబు, ఆశా కిరణ్(ఆంధ్రా యూనివర్సిటీ) డాక్టర్ మోహన్, ప్రత్యేక అతిథులుగా, బి. గంగా రావు(సి. పి. ఎం) కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ(వైఎస్.ఆర్.సి.పి) కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ కొవ్వుల వెంకటరావు,వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నుండి ఐ.ఎం. అహ్మద్ (అడ్వకేట్) తదితరులు హాజరు అయ్యారు. ఉక్కు పరిరక్షణ పోరాట సమితి, దళిత సంఘాల జె.ఏ.సి తరుపున ప్రభాకర్ జె.వి.విశ్రాంత (ఆర్. జె. డి) రాష్ట్ర అధ్యక్షులు(%ణవూూ) %విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, సి. హెచ్. నరసింగ రావు వై. మస్తానప్ప, ఇతర నాయకులు, ప్రజా సంఘాల నా యకులు శ్రీ పడాల రమణ, శ్రీ జి. వామనమూర్తి మరియు ఇతర నాయకులు, దళిత సంఘాల నుండిబి.కల్యాణరావు(ఆర్.పి.ఐ) బి. అ ప్పా రా వు, జి.రాంబాబుమండేసత్యనారాయణ (డి. హెచ్. పి. ఎస్), పట్టా రమేష్ బాబు, కోటేశ్వరరావు (ఏఐడిఆర్ఎఫ్), ఆర్. పి. రాజు(కె. వి. పి. ఎస్), సోడదాసి సుధాకర్(కాంగ్రెస్) పాల్తేటి పెంటరావు(దళితసేన) యమ్. రవిసిద్దార్ధ, చిన్నారావు,, దుర్గారావు(భీమ్ సేన), చింతాడ సూర్యం(డి. బి. ఎస్), శ్రీ కె. రాములప్పడు, శ్రీ తులసీ రావు(రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున) ఎల్. బి. రాజేంద్రప్రసాద్(%ξ౧%. ప్రిన్సిపాల్)డాక్టర్. వి.ఆర్.ప్రసాద్, ఏ యూ డాక్టర్ మోహన్,సాద్, విజ్ఞానంద్, రాంప్రభు, ఎం.కిరణ్ కుమార్(నావెల్ డాక్ యార్డ్), మహిళల తరుపున నాగమణి, సరస్వతి ఇంకా ఇతర నాయకులు కార్యకర్తలు, వక్తలు,పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు.

భూదేవి పేట భేష్..

అభినందించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి హాజరైన డీపీఓ సుభాషిణి గ్రామాన్ని ఒకసారి పరిశీలించి పచ్చదనం పరిశుభ్రత, మంచినీటి కనెక్షన్లలో ముందంజలో ఉండడంతో భూదేవి పేట గ్రామ సర్పంచ్ కనకల ప్రవీణ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని అభినందించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భూదేవి పేట గ్రామాన్ని అభినందిస్తూ చేసిన ప్రసంగాన్ని అధికారులతో పాటు గ్రామస్తులు విన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ కుమారి, ఎంపీడీఓ కిశోర్ కుమార్ ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, సర్పంచ్ కె.ప్రవీణ, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కనకల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత డా.గంగిరెడ్డికి పులివెందుల ఘాట్‌లో...జగన్ ఫ్యామిలీ ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిన్ననే కడప జిల్లాకు చేరుకున్నారు. కడప ఎయిర్‌పోర్టు, ఇడుపులపాయలో సీఎం వైయస్ జగన్‌కు ఘన స్వాగతం లభించింది. కడప ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4.20 గంటలకు ఇడుపులపాయ వైయ‌ఎస్సార్ ఎస్టేట్‌కు చేరుకున్న సీఎం వైయస్ జగన్‌కు ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు స్వాగతం పలికారు.

మమత బెనర్జీ ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

టీఎంసీ ఓడించింది. 34 ఏళ్ళ వామపక్షాల పాలనకు తెరదించిన ఆ ఎన్నికల్లో ఆమె 49,936 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. తాజాగా భవానీ పూర్ ఉప ఎన్నికలో తన రికార్డును తానే తిరగరాశారు. ఈ ఉప ఎన్నికలో ఆమె 58,832 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలో షంషేర్ గంజ్, జంగీపూర్ శాసన సభ నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గాల్లో కూడా టీఎంసీ ఆధిక్యంలో ఉంది.

బద్వేల్ ఉప ఎన్నికలో.. పోటీ చేయబోం:టీడీపీ

(మొదటి పేజీ తరువాయి)

మిత్రపక్షమైన జనసేన పోటీకి నై అనగా.. బీజేపీ మాత్రం సై అంటోంది. ఇందులో భాగంగా ఇవాళ కడప జిల్లా నేతలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు భేటీ అయ్యారు. బద్వేల్‌లో బీజేపీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందని, ఇదే విషయాన్ని జాతీయ నాయకత్వానికి తెలియజేశామని సోము వీర్రాజు తెలిపారు. స్థానికంగా ముగ్గురు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఒవైసీ రాజకీయాలతో... కమలం ఖుషీ

లక్నో, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: అసదుద్దీన్ ఒవైసీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని భావిస్తున్నారు. మహారాష్ట్ర, బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కొన్ని స్థానాలను దక్కించుకోవడంతో ఆయన అన్ని రాష్ట్రాల్లో ఎంఐఎం ను విస్తరించాలని నిర్ణయించుకున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ లో ఆయన పోటీ చేయాలని నిర్ణయించారు. అయితే అసదుద్దీన్ ఒవైసీ నిర్ణయాలు బీజేపీకి లబ్ది చేకూరుస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ లలో ముస్లిం ఓటర్లు కొంత ఎక్కువగానే ఉన్నారు. తొలి నుంచి ముస్లిం సామాజికకవర్గం కాంగ్రెస్ కు అనుకూలంగా ఉండేది. గుజరాత్ లో ఇప్పటికీ కాంగ్రెస్ వెంటే ఉంటూ వస్తుంది. బీజేపీ దశాబ్దాలుగా అక్కడ అధికారంలో ఉన్నప్పటికీ ముస్లిం ఓటు బ్యాంకు మాత్రం చెక్కు చెదరలేదు. కారణం ఇక్కడ జాతీయ పార్టీలు తప్పించి మరో ప్రాంతీయపార్టీ బలమైనది లేకపోవడమే. అందుకే కాంగ్రెస్ వెన్నంటే ఉన్నారు. ఇక్కడ అసదుద్దీన్ ఒవైసీ పార్టీ పోటీ చేస్తే కాంగ్రెస్ కే నష్టం చేకూరుస్తుంది. ఇక ఉత్తర్ ప్రదేశ్ లోనూ కాంగ్రెస్ వెంటనే నడిచిన ముస్లిం సామాజికవర్గం తర్వాత సమాజ్ వాదీ పార్టీ వైపు మొగ్గు చూపారు. అయితే ప్రియాంక గాంధీ యూపీ కాంగ్రెస్ చీఫ్ గా వచ్చిన తర్వాత తిరిగి ముస్లిం సామాజికవర్గం కాంగ్రెస్ వైపు చూస్తుందంటున్నారు. ఈ నేపథ్యంలో అసదుద్దీన్ ఒవైసీ తన పార్టీ అభ్యర్థులను పోటీలోకి దించుతున్నారు. ఇది సమాజ్ వాదీ పార్టీకి, కాంగ్రెస్ కు నష్టం చేకూరుస్తుందంటున్నారు. ఉత్తర్ ప్రదేశ్ లో 19 శాతం ఉన్న మైనారిటీ వర్గాలను తన వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అసదుద్దీన్ ఒవైసీ యూపీలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. దాదాపు 80కి పైగా స్థానాల్లో ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ఇప్పుడు ఈ నియోజకవర్గాల్లో బీజేపీ లాభపడితే అది అసదుద్దీన్ ఒవైసీ వల్లనేనని స్పష్టమవుతుంది. కానీ ఒవైసీ మాత్రం తన పార్టీ విస్తరణకు పోటీ చేయక తప్పడం లేదని, వంద స్థానాల్లో పోటీ చేస్తామని అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. మొత్తం మీద ఉత్తరాదిన ఒవైసీ దెబ్బ విపక్షాలకే తగిలేటట్లు ఉంది.

కొడాలి నానిపై ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఫైర్

కృష్ణా: మంత్రి కొడాలి నానిపై ఎంపీ రామ్మోహన్‌నాయుడు మండిపడ్డారు. రాజకీయ భిక్ష పెట్టిన టీడీపీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తోందన్నారు. అప్పుల భారం, పన్నుల భారం తప్ప.. ప్రజలకు వైసీపీ చేసింది శూన్యమన్నారు. సన్నబియ్యం ఇస్తామని మంత్రి ఇప్పుడు తోక ముడిచారని విమర్శించారు. 22 మంది ఎంపీలు ఉండి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేలేని నేతలు.. బూతులు తిట్టడంలో మాత్రం పోటీలు పడుతున్నారని విమర్శించారు. రాజధాని పేరుతో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందన్నారు.

ట్రూ అప్ ల భారం...

ఒంగోలు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: కేంద్రం విధిస్తున్న షరతులతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం పెరుగుతోంది. అదనపు రుణాలు తీసుకోవడానికి అనుమతించాలంటే డిస్కామ్‌ల ప్రయివేటీకరణ, ఈలోగా వాటి నష్టాలను తగ్గించడం వంటి అంశాలపై కేంద్రం చేస్తున్న ఒత్తిడి వల్లనే రాష్ట్రంలో సంస్కరణల అమలు వేగవంతమవుతోందని, విద్యుత్ భారాలు పెరుగుతున్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. కేంద్ర ఆర్థికశాఖ (వ్యయ విభాగం) ఇటీవల నిర్వహించిన ఒక సమావేశంలో ఈ అంశాలు చర్చకు రాగా, ఆరంధ్రప్రదేశ్‌తోపాటు కొన్ని రాష్ట్రాలు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రానున్న నాలుగేళ్లలో రూ.23,227 కోట్లు అదనపు రుణం తీసుకునేందుకు అవకాశం వుంటుందని, అందుకు ఆయా షరతులు అమలు చేయాలనీ కేంద్రం స్పష్టం చేసింది. ఇంధన శాఖలో సంస్కరణలను అమలు చేస్తే అందుకు ప్రతిఫలంగా జిఎస్‌డిపిలో 0.50 శాతం అదనపు రుణం లభిస్తుంది. డిస్కామ్‌ల నష్టాలను రాష్ట్రాలు భరించాల్సి ఉంటుంది. తొలి ఏడాది 60 శాతం నష్టాలను రాష్ట్రాలు భరించాల్సి ఉండగా, రెండో ఏడాది 75 శాతం, మూడో ఏడాది 90 శాతం నష్టాలను భరిస్తూ 2024-25 నాటికి వంద శాతం భరించాల్సి ఉంటుంది. అంటే 2025 మార్చి 31 నాటికి డిస్కాములకు ఒక్క రూపాయి కూడా నష్టం ఉండరాదన్నమాట. సంపూర్ణ ఆర్థిక ఆరోగ్యంతో ప్రైవేటువారికి డిస్కాముల్ని పూర్తిగా కట్టబెట్టొచ్చు. వీటితోపాటు అదనపు రుణానికి సంబంధించి కేంద్రం దాదాపు 12 షరతులను నిర్దేశించింది. ఇందులో వరుసగా నాలుగేళ్లపాటు ఏ ఏడాది ఏయే సంస్కరణలు చేపట్టాలో స్పష్టం చేసింది. ప్రతియేటా డిస్కామ్‌లు తీసుకున్న అదనపు రుణాలపై ఆడిట్ నిర్వహించాలని, ప్రతి త్రైమాసికానికి ఈ నివేదికలు సమర్పించాలని నిర్దేశించింది. బకాయిల వసూళ్లపైనా నివేదికలు ఇవ్వాలని, కొత్త ఆస్తుల కల్పన వద్దని కూడా ఒక ఆంక్షగా పేర్కొనడం గమనార్హం. గత నష్టాలను భర్తీ చేసుకునేందుకు ట్రూఅప్ ఛార్జీల వసూళ్లను కూడా ఒక షరతుగా కేంద్రం పేర్కొంది. ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటవ తేదీ ప్రాతిపదికగా ట్రూఅప్‌ను ఛార్జీల్లో చూపించాలని నిర్దేశించడం గమనార్హం. విద్యుత్ ఆదాయ వ్యయాలకు సంబంధించి ప్రతి త్రైమాసిక వివరాలను కేంద్ర ఇంధన శాఖకు పంపించాలని స్పష్టం చేసింది. డిస్కామ్‌ల రుణాలకు సంబంధించి లెటర్ ఆఫ్ క్రెడిట్ తప్పనిసరి చేసింది. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందాలపైనా ఆంక్షలు విధించడం గమనార్హం. కొత్తగా వచ్చే అదనపు రుణాల కోసం రాష్ట్రంలో ఎఫ్‌ఆర్‌బిఎం చట్టాన్ని సవరణ చేయాలని నిర్దేశించింది. ఒక ఏడాది అనుమతించిన అదనపు రుణాన్ని తీసుకోని పక్షంలో ఆ తరువాతి ఏడాది కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే డిస్కామ్‌ల భవిష్యత్ నష్టాలను రాష్ట్రాలు తీసుకోవాలని, డిస్కామ్‌ల అప్పులపై ప్రతి నెలా నివేదికలు సమర్పించాలని తేల్చిచెప్పింది.

రూ.7 లక్షల మద్యం పట్టివేత



విజయవాడ: అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర మద్యాన్ని పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుండి హైదరాబాద్ మీదుగా గుంటూరు జిల్లా రేపల్లె తరలిస్తున్నారు. రూ.7 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న బస్సును పోలీసులు సీజ్ చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పెళ్లి చేసుకోని మాజీ ప్రేమికులు అలా....

కర్నూలు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: వారిద్దరిది ఒకే గ్రామం.. యుక్త వయసులో ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకుని, సుఖంగా గడపాలని కలలు కన్నారు. కానీ, పెద్దలు వీరి ప్రేమ బంధానికి అడ్డుపడ్డారు. పెద్దలు అంగీకరించక పోవడంతో ఇద్దరు వేర్వేరు పెళ్లిళ్లు చేసుకున్నారు. అయినా గతం వీరిని వెంటాడింది. యుక్త వయసులో ఇద్దరి ప్రేమ ఊసుల జ్ఞాపకాలు మదిలో మెదిలేవి. మనసులు దగ్గరగా ఉన్నా.. మనుషులు వేరుగా బతకాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చివరకు అనూహ్య నిర్ణయం తీసుకుని చావులోనూ కలసి పయనించి.. ఇద్దరూ ఈ లోకాన్ని వీడారు. కర్నూలు జిల్లా శ్రీశైలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు చేసుకున్న ఇద్దరి జీవితాలు ఇలా ముగిశాయి. బత్తుల వెంకట కాళేశ్వరరావు (45), బత్తుల నాగలక్ష్మి (40) ఇద్దరిదీ గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామం. వీరిద్దరూ 15 ఏళ్ల క్రితం ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని భావించారు. కానీ, ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో కాళేశ్వరరావుకు గుంటూరుకు చెందిన లక్ష్మితో వివాహమైంది. నాగలక్ష్మికి నరసరావుపేట పట్టణానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. కాళేశ్వరరావు గ్రామంలోనే ఉంటూ తాపీ మేస్త్రీగా పని చేసేవాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు సంతానం. బత్తుల నాగలక్ష్మి నరసరావుపేట పట్టణంలోని పెద్దచెరువులో నివాసముండేది. భర్త టైలర్‌గా పని చేసేవాడు. నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. అయితే కరోనా మహమ్మారి కారణంగా కుటుంబం గడవటం కష్టంగా ఉండటంతో ఏడాది క్రితం నాగలక్ష్మి భర్తను తీసుకొని, తన స్వగ్రామమైన ఇస్సపాలెం వచ్చింది. ఇక్కడే ఉంటూ పలువురికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తూ జీవనం సాగించేది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ కాళేశ్వరరావు, నాగలక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఇదే సమయంలో నాగలక్ష్మి కనిపించడం లేదంటూ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఆమె అక్క శివరాత్రి వెంకటరమణ ఫిర్యాదు చేసింది. మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారుఇంతలోనే కాశేశ్వరరావు తన భార్య లక్ష్మికి ఫోన్ చేశాడు. “నా గురించి ఎదురు చూడవద్దు. నాపై ఆశలు పెట్టుకోవద్దు” అంటూ బత్తుల కాళేశ్వరరావు తన భార్య లక్ష్మీకి కాల్ చేసి చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనుమానం వచ్చిన లక్ష్మి తిరిగి భర్తకు భర్తకు కాల్ చేయగా స్పందించలేదు. రెండు గంటల అనంతరం కాళేశ్వరరావు భార్యకు శ్రీశైలం పోలీసుల నుంచి ఫోన్ రాగా, ఊహించని విషయం తెలిసింది. శ్రీశైలం మహాక్షేత్రంలోని ఓ ప్రైవేట్ సత్రంలో కాశేశ్వరరావు, నాగలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీశైలం ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గత బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరూ కలిసి సత్రంలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగారని ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. పురుగుల మందు తాగిన వెంకటకాళేశ్వరరావు కడుపులో తిప్పుతోందని గట్టిగా కేకలు వేయడంతో సత్రం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్ట్‌మార్టం అనంతరం వారి బంధువులకు మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఇలా, పెళ్లయిన 15 ఏళ్ల తర్వాత.. ప్రేమికులు ఆత్మహత్య చేసుకుని వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపారు. రెండు కుటుంబాల్లోని బిడ్డలు అన్యాయంగా అనాథలుగా మారారు.

ట్రబుల్ షూటర్ గా చినరాజప్ప

రాజమండ్రి, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీలో చినరాజప్ప కీలకంగా మారబోతున్నారు. ఆయన పార్టీకి, అధినేతకు నమ్మకమైన నేతగా కొనసాగుతున్నారు. చినరాజప్ప గతంలో విపక్షంలో ఉన్నప్పుడు కూడా జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను చూశారు. సమర్థవంతంగా తన బాధ్యతలను నిర్వహించారు. అందుకే చినరాజప్పకు 2014 ఎన్నికల్లో చిన రాజప్పకు చంద్రబాబు ఏరికోరి పెద్దాపురం టిక్కెట్ ను ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనకు కీలకమైన హోంమంత్రి పదవిని ఇచ్చారు. చినరాజప్పది మెతక స్వభావం. నెమ్మదిగా ఉంటూనే పనిని చక్క బెడతారన్న పేరుంది. ఆయనను ముఖ్యమైన విషయాల్లో చంద్రబాబు ఉపయోగించుకుంటున్నారు. లోకేష్ తో కూడా మంచి సంబంధాలు కొనసాగించడం ఆయనకు ప్లస్ పాయింట్. 2019లో పెద్దాపురం నుంచి తిరిగి గెలిచిన చినరాజప్ప అధినాయకత్వానికి నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గోరంట్ల బుచ్చయ్య చౌదరి అలిగిన సమయంలోనూ చంద్రబాబు చినరాజప్పను వినియోగించుకున్నారు. త్రీమెన్ కమిటీని నియమించినప్పటికీ అందులో చినరాజప్ప గోరంట్ల బుచ్చయ్య చౌదరిని బుజ్జగించడంలోనూ, రాజీనామా చేయకుండా నిరోధించడంలోనూ చినరాజప్ప కీలక భూమిక పోషించారు. ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ దూకుడు ఎక్కువగా ఉంది. అక్కడ పార్టీ నేతల మధ్య విభేదాలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో నాయకత్వ సమస్య పార్టీని ఇబ్బంది పెడుతుంది. ఈ సమయంలో చినరాజప్ప సేవలను వినియోగించుకోవాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారని తెలుస్తోంది. నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలను పరిష్కరించే బాధ్యతను చినరాజప్పకు అప్పగించనున్నారని తెలిసింది. చినరాజప్ప అయతే స్మూత్ గా డీల్ చేస్తారని చంద్రబాబు భావిస్తున్నారు. అదే జిల్లాలో సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఉన్నప్పటికీ చినరాజప్పకు ప్రాధాన్యత ఇచ్చేందుకే చంద్రబాబు డిసైడ్ అయ్యారని తెలుస్తోంది.

ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాలు

ఏలూరు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: మండలం లో శ్రీపర్రు గ్రామములో ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శ్రీపర్రు గ్రామంలో ఏర్పాటు చేయబడిన సమావేశంలో పాల్గొని వన్యప్రాణి సంరక్షణ గురించి, కొల్లేరు లో నివసిస్తున్న ప్రజలకు పూర్తి సహాయక సహకారాలు అందించాలని ప్రసంగించిన ఆంధ్ర ప్రదేశ్ వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు .. ఈకార్యక్రమంలో సైదు వజ్రం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అశోక్ కుమార్.

నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తుంది: పెదబాబు

ఏలూరు అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని నగరపాలకసంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. నగరంలో పారిశుద్ధ్య పనులను మెరుగుపరిచేందుకు జగనన్న స్వచ్ఛ సంకల్పంక్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరానికి కేటాయించిన చెత్త సేకరణ వాహనాలను పంపుల చెరువు ఆవరణలో ఉంచారు. ఆ వాహనాలను ఆదివారం పెదబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలనే మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించేందుకు గాను చెత్త సేకరణ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలందరూ కూడా ఇంట్లోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందించి నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం వాహనాల నిర్వహణకు కేటాయించబడిన సూపర్వైజర్ లతో పెదబాబు మాట్లాడారు..

ప్రముఖ వైద్యులు పిడికిటి వెంకటేశ్వరరావు మృతి ప్రజలకు తీరని లోటు: మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య

కంచికచర్ల, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: ఆదివారం ఉదయం పిడికిటి వెంకటేశ్వర రావు భౌతికకాయాన్ని మాజీ శాసన సభ్యురాలు సౌమ్య సందర్శించి పూల మాల వేసి నివాళులు అర్పించి ఆయన పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కు టుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పిడికిటి వెం క టేశ్వరరావు 1966 లో కంచికచర్ల లో వైద్య వృత్తిని ప్రారంభించారు. 1980లో కంచికచ ర్లలో లైన్స్ క్లబ్ ఏ ర్పాటు చేసి వేలాది మంది పేద ప్ర జానీకానికి కంటి చూపునిచ్చారు1987 లో కంచికచర్ల లో ప్రభుత్వ జూ నియర్ కాలేజీ ఏర్పాటుకు దాతల సహకారంతో 20 ఎకరాల భూమిని కొని ప్రభుత్వానికి అందజేయడం లో కీలక పాత్ర పోషించారుటిటిడి క ళ్యాణ మండ పానికి ఎకరం భూమిని అందజేశా రు హస్తవాసి గల వై ద్యులు కావడంతో కంచికచర్ల, వీరు లపాడు మం డ లాలలో పేద ప్రజానీకం మొత్తం వెంకటేశ్వరరావు వ ద్ద వైద్య సేవలు పొందేవారుఇటు వై ద్య వృత్తిలోనూ, సమాజ సేవలోనూ ఎన్నో సేవలు అందించిన పిడికిటి వెంకటేశ్వరరావు మృతి పార్టీకి మరియు స్థానిక ప్రజానీకానికి తీరని లోటుఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నేతలు పాల్గొన్నారు.

బిసి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకి ఘన సన్మానం



జగ్గయ్యపేట అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: జగ్గయ్య పేట నియోజకవర్గం నుంచి ఇటివల రాష్ట్ర మైనింగ్ దెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా బత్తుల రామారావునియామకానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ జగ శాసన సభ్యులు సామినేని ఉదయభానుని రా ష్ట్రంలోని బిసి సంఘం నేతలు వారి నివాసంలో కలసి దుశ్శాలువతో పూలదండ తొ ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా బిసి సంఘం నాయకులు మా ట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తోనే బీసిలు అన్ని రంగాల్లో సర్వముఖ అభివృద్ధి చెందుతారని పేర్కొ న్నారు అదేవిదంగా రాష్ట్ర మైనింగ్ దెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా రామారావును నియమించటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశామన్నారు రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికిఉద యభానుకీ వారు ప్రత్యక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్య క్రమంలో బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లేపు విరా రఘవయ్య రాష్ట్ర టిట్ కో డైరెక్టర్ నాగేశ్వరమ్మ ఏపి బ్రిజ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామరా జు వడ్డెర సంక్షేమ సంఘం విజయవాడ పట్టణ అధ్య క్షులు రిటైర్ ఎస్ఐ బత్తుల నాగేశ్వరరా వుబిసి యు వజన సంఘం అధ్య క్షుడు రాజుల మణి కంత విజ యవాడ నగర నాయ కులు గుంజ శ్రీరాములు త దిత రులు పాల్గొన్నారు

వైసీపీ నేత తలపనేని ప్రభాకర్ చౌదరి అరాచకాలు అరికట్టండి: భాధితురాలు సయ్యద్ మోలాబీ, బాజీ

కావలి అక్టోబర్ 2 ప్రజాపాలన ప్రతినిధి :కావలి పట్టణంలోని 31 వార్డు వైసీపీ ఇన్చార్జ్ తల్లపనేని ప్రభాకర్ చౌదరి గత కొద్దిరోజులుగా మా కుటుంబంను వేదిస్తూ బెదిరిస్తున్నాడని భాధితులు సయ్యద్ బాజి ,మౌలాబీ లు ఆరోపించారు. శనివారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్ లో వారు మాట్లాడుతూ తమ కుటుంబ అవసరాల నిమిత్తం పిన్నమ్మ ,చిన్నాయన దగ్గర లక్ష రూపాయలు డబ్బులు వడ్డీకి తీసుకున్నామని అనంతరం వారు డబ్బుల్ని అడిగిన వెంటనే తిరిగి వడ్డీతో సహా పెద్దమనిషి వైసీపీ నేత ప్రభాకర్ చౌదరి సమక్షంలో చెల్లించామని తెలిపారు. అయితే గత రెండు రోజులుగా వైసీపీ నేత ప్రభాకర్ చౌదరి నాకు 20 వేలు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. మానాన్నకు ఆరోగ్యం కూడా బాగా లేదని ఆయనకు గుండె జబ్బు కూడా ఉందని ఆయనకు పోన్ చేసి బెదిరిస్తున్నారని తెలిపారు. పిన్నమ్మ దగ్గర డబ్బులు తీసుకుంటే ఇతనికి ఏం సంబందం ఉందని ప్రశ్నించారు. ప్రభాకర్ చౌదరి ఇష్టానుసారంగా దుర్భషలాడుతూ రౌడియుజం చేస్తూ ప్రభుత్వం మాది నన్ను ఎవరూ ఏమి చేయలేరంటూ బెదిరిస్తున్నారని వాపోయారు.ఆ వార్డులో దందలు చేస్తూ బెదిరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అయిన అతనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మా కుటుబంలో ఏమి జరిగినా వైసీపీ నేత ప్రభాకర్ చౌదరి దానికి కారణం అని వారు తెలిపారు.

కొండవీటి ఈఎన్టి హాస్పిటల్ లో ఉచిత మెగా వైద్య శిబిరంను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా నరసరావుపేట పట్టణంలో కొండవీడు ఎన్ టి హాస్పిటల్ నందు గత 20 సంవత్సరాలుగా సంవత్సరంలో మూడు సార్లు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరంలో అక్టోబర్ 2 గాంధీ జయంతిని పురస్కరించుకుని,కొండవీడు హాస్పిటల్ నందు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు,ఈ వైద్య శిబిరానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి క్యాంపులు ప్రారంభించారు,ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ మెడికల్ క్యాంప్ నందు ఈరోజు 300 మందికి వైద్య పరీక్షలు, రెండు లక్షల విలువగల ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు, మెడికల్ క్యాంపులో ఆపరేషన్ అవసరమైన వారికి 30 మందికి ఉచితంగా ఆపరేషన్ , మరియు పేషంట్ లో చెవిటి మిషన్ అవసరమున్న పదిమందికి 30% రాయితీ లో ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ మెడికల్ క్యాంప్ లో డాక్టర్ రామ్ మోహన్ రెడ్డి, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ శ్రీ వర్షిని, ఆడియాలజిస్టులు రవికుమార్, నాగేశ్వరరావు భూలక్ష్మి, ఫార్మసీ స్వామి, మేనేజర్ మహేష్ , హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంగుంట్లలో సుమారు మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట లింగంగుంట్ల అగ్రహారం నందు 1,2 గ్రామ సచివాలయం,వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్,రైతు భరోసా కేంద్రం నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి , ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు , ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి,గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చింత కిరణ్ కుమార్ ,జడ్పిటిసి చిట్టిబాబు ,రొంపిచర్ల జెడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి ,ఎంపీపీ మారబోయిన శ్రీనివాసరావు , రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి రమేష్ , పొన్నపాటి ఈశ్వర్ రెడ్డి ,సాంబిరెడ్డి నాగిరెడ్డి , పొన్నపాటి విజయ్ మరియు వైఎస్సార్సీపీ నాయకులు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం: రాజమండ్రి పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్

గుంటూరు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ఈస్ట్ గోదావరి జిల్లా అధ్యక్షుడు మీసాల గణేష్ ఆధ్వర్యంలో యన్. జి. ఓ కమిటీ రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ ని మర్యాద పూర్వకంగా కలిసి, రోడ్డు ప్రమాదాల నివారణకు తమ యన్. జి. ఓ సంస్థ చేసే కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈస్ట్ గోదావరి జిల్లా రహదారి భద్రతా కమిటీ లో పార్లమెంటు సభ్యులు అధ్యక్షుడు గా ఉండే కమిటీ లో ముగ్గురు యాక్టీవ్ యన్. జి. ఓ సంస్థలకు అవకాశం ఉందని, మా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ రాష్ట్ర వ్యాప్తంగా పదమూడు జిల్లా లో యాక్టీవ్ గా పనిచేస్తుంది అని, రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. కె. దుర్గ పద్మజ యమ్. పి ని మా రోడ్డు సేఫ్టీ యన్. జి ఓ ఈస్ట్ గోదావరి జిల్లా అధ్యక్షులు మీసాల గణేశ్ కి యన్. జి. ఓ ల ప్రాతినిధ్యం క్రింద అవకాశం ఇవ్వాలి అని కోరుతూరాసిన లేఖను యమ్. పి కి అందజేశారు. ఈ సందర్భంగా రాజమండ్రి ఎంపీ భరత్ మాట్లాడుతూ తప్పకుండా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ కి జిల్లా రహదారి భద్రతా కమిటీ లో అవకాశం కలిపిస్తాము అని మీ లాంటి యన్. జి. ఓ సంస్థ ల ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి అని కోరారు. దీనికి యన్. జి. ఓ కమిటీ ప్రజా ప్రతినిధులు, స్టేక్ హోల్డర్స్ ని భాగస్వామ్యం చేసి రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ముందుగా పార్లమెంటు సభ్యులు భరత్ ని శాలువా వేసి పూలమాల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోగంటి అరుణ్ కుమార్, నూకాల వీరబాబు కె. వెంకటేశ్వరరావు, పి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ నుండి వైఎస్ఆర్ సీపీలోకి చేరికలు

జగ్గయ్యపేట అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: జగ్గయ్య పేట మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కి చెందిన 50 కుటుంబా లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గ య్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను స మక్షంలో గ్రామానికి చెందిన మాజీ జడ్పిటీసీ సభ్యు లు భూక్యా శ్రీరాములు నాయక్, మాజీ సర్పంచ్ భూ క్యా సీత్యా నాయక్, మాజీ ఉప సర్పంచ్ భూక్యా రా మదాసు, భూక్యా పరుశురామ్, భూక్యా బాలు, భూ క్యా కురిమి వీరన్న, భూక్యా శ్రీరాములు తో పాటు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్ సీ పీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా క ప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఎసెమ్మెసి ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్ భూక్యా అనిత, వైస్ చైర్మన్ ధారావత్ తావూరియా నాయక్ లను అభినందించారు. వీరందరికీ శా లువతో ఘనంగా సన్మానించారు. గ్రామంలో పార్టీ బ లోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్ర భుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రా మ నాయకులు కొట్టే పాండురంగారావు, మాజీ ఎం పీటీసీ ధారావత్ రవీంద్ర నాయక్, పాండు, సక్రు నా యక్, సాయిబాబా, సైదా నాయక్, భూక్యా జ్వాలా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ వృద్ధులకు ఇంటర్ విద్యార్థుల పౌష్టికాహార పంపిణీ

చల్లపల్లి, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: చల్లపల్లి విజయ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతున్న రమ్య శ్రీ, పావని, నాగమణి అనే ముగ్గురు స్నేహితుల ఆలోచన పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. విద్యార్థి దశలోనే ఉన్నత భావాలు ప్రదర్శించి తమ శక్తికి మించిన మంచి కార్యక్రమం చేశారు ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు. ఈ ముగ్గురు విద్యార్థులు కలిసి వారి తల్లిదండ్రులు వారి అవసరాలకు ఇచ్చిన డబ్బులో నుండి కొంత డబ్బును సమకూర్చి బీదలైన వృద్ధులకు సహాయం అందించాలని ఎనిమిది వేల రూపాయల విలువైనఢ్డ రొట్టెలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని స్థానిక చల్లపల్లి నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందజేశారు వారిని ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కర రావు, సునీత దంపతులు ఈ ముగ్గురు విద్యార్థులను అభినందించారు.

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్
కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం
కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల
కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

Term	General	Senior Citizens
180 Days - 1 Year	7%	7.5%
1 Year - 2 Years	8%	8.5%
2 Years - 3 Years	9%	9.5%
3 Years - 5 Years	10%	10.5%
Above 5 Years	11%	11.5%
Savings Bank A/c	5%	5%
Recurring Deposit	6%	6.5%

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :

Hyderabad	76600 27682, 7842106355
Visakhapatnam	0891-2791205, 9246663046
	7660027696, 7660027664
Vijayawada	76600 27670, 900062111
Tirupathi	94400 77239
Bapatla	94403 20562
Ponnur	99089 91763
Cherukupalli	79958 56068
Karlapalem	76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 04,అక్టోబరు 2021

పువ్వల్లే నవ్వుల్ నవ్వుల్...

'నవ్వడం ఒక భోగం/ నవ్వించడం ఒక యోగం/ నవ్వకపోవడం ఒక రోగం' అంటాడు జంధ్యాల. గతంలో అసెంబ్లీలో ఎప్పుడూ సీరియస్‌గా కనిపించే ఓ ప్రతిపక్ష నాయకుడ్ని ఉద్దేశించి అప్పటి ముఖ్యమంత్రి పదేపదే ఈ డైలాగ్ చెబుతూ ఇంకా పాపులర్ చేశారు. ఆనందంగా హాయిగా నవ్వుకుంటూ... గడపగలిగితే మంచి వాతావరణాన్నిస్తుంది. మంచి సమాజాన్నీ ఇస్తుంది. కనుకనే చిరునవ్వును మానవ భాషగా అభివర్ణిస్తారు. అది వ్యక్తిత్వానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబం. మనోభావాల మాధ్యమం. సంస్కారానికి సజీవ రూపం. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సులభంగా అర్థం చేసుకోగల శాంతి సంకేతం. అందుకే అంటారు... 'భాష లేని మాధ్యమం చిరునవ్వు' అని. హృదయాలను కదిలిస్తుంది. జీవితాన్ని అందంగా మార్చుతుంది. ముఖానికి చిరునవ్వును మించిన అలంకారం లేదు. భావవ్యక్తీకరణలో చిరునవ్వు ప్రధానమైన సాధనం. చిరునవ్వుకి మించిన ఆభరణం... ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం... ఈ ప్రపంచంలో మరొకటి లేదు. 'నవ్వుతూ బతకాలిరా తమ్ముడూ/ నవ్వుతూ చావాలిరా/ చచ్చినాక నవ్వలేవురా/ ఎందరేడ్చినా బతికిరావురా' అంటాడు సినీకవి ఆత్రేయ. అలాగే నవ్వుపైన సినిమాల్లోనూ వందలాది పాటలున్నాయి. ఇవ్వనీ నవ్వులోని హాయిని, ఉత్సాహాన్ని నింపేవే. నిత్యం మోముపై ఓ చిరు నవ్వు మొలకలేస్తే... ఆ మనిషిలో ఆరోగ్యం ఉరకలేస్తున్నట్టే. అలా అందరూ ఉండగలిగితే ఆ సమాజం అంతా ఆనందమయం. ఆధునిక జీవితమంతా ఉరుకుల పరుగుల మయం. ఈ పోటీ ప్రపంచంలో వేగంగా సాగకుంటే జీవితమే వ్యర్థమనే ఒక కృత్రిమ పోటీని తీసుకొచ్చింది ప్రపంచీకరణ. కోవిడ్‌తో ఒత్తిడి మరింత పెరిగింది. విద్యార్థులపై ఆన్‌లైన్ చదువుల ఒత్తిడి. గహిణులపై వేళాపాళా లేని ఇంటి పని ఒత్తిడి. ఇంటి యజమానిపై ఉద్యోగం, వ్యాపారం వంటి బాధ్యతల ఒత్తిడి... ఇలా ప్రతి ఒక్కరూ తీరిక లేని ఒత్తిడితో క్షణం తీరికలేని జీవితం గడుపుతున్నారు. దీంతో ఆనందం కరువైంది... ముఖంలో నవ్వు మాయమైంది. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఒకదగ్గర కూర్చొని సరదాగా నవ్వుకోవడం అరుదైన దృశ్యంగా మారింది. రోజుకు రూ.1002 కోట్లు సంపాదించే అదానీ నవ్వు వెనుక... కోట్లాది మంది అర్థాకలి బతుకులు... ఆకలి రోదనలు వున్నాయి. వీరందరూ ప్రశాంతంగా ఎలా నవ్వుతారు ? నిరాశ నిస్పృహలకు, ఆందోళనలకు లోనవుతున్న మనిషి... నిత్యజీవితంలో సంతోషాన్ని, ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నాడు. జీవన శైలిలో యంత్రాలు భాగమైనట్లే... వ్యక్తిగత జీవితంలోనూ యాంత్రికత భాగమైపోయింది. క్రమేణా జీవితంలో నవ్వు కనుమరుగై పోతున్నది. వస్తువుగా మారిపోయి... పరిమళంలేని ప్లాస్టిక్ పూవుల్లా జీవంలేని నవ్వొకటి ముఖాన తగిలించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. మనకు కావాల్సింది జీవంలేని ఈ కృత్రిమ నవ్వులు కాదు. పెదాల మధ్య స్వచ్ఛమైన పువ్వుల్లా విచ్చుకునే చిరునవ్వు కావాలి. మనకు సినిమాల్లోను, టీవీల్లోనూ హాస్య సన్నివేశాలకు ప్రాధాన్యతనిస్తుంటాం. అందుకే జబర్దస్త్ లాంటి కామెడీ ప్రోగ్రామ్‌లు విజయవంతం అవుతున్నాయి. 'పువ్వల్లే నవ్వుల్ నవ్వుల్' అన్నట్లుగా... హాస్యం చిరునవ్వులను పండిస్తుంది. ఆ హాస్య కార్యక్రమాలను చూస్తున్నంతసేపు తమ బాధలను మర్చిపోయి... తిక్కన చెప్పినట్లుగా 32 రకాల నవ్వులు కాకపోయినా హాయిగా చిరునవ్వు మాత్రం కచ్చితంగా నవ్వుకుంటారు. అన్ని రాష్ట్రాల కంటే తెలుగు రాష్ట్రాల్లోనే ప్రపంచీకరణ విధానాలు ముందు మొదలయ్యాయి. అందుకే మిగతావారికంటే బాధలు కూడా మనకే ముందు మొదలయ్యాయి. ఈ బాధలు, కష్టాలను మర్చిపోయి, రేపటికోసం మళ్లీ ఉత్సాహాన్ని నింపుకోడానికి ఇలాంటి హాస్యం టానిక్‌లా ఉపయోగపడుతుంది. అంతేకాదు... చిరునవ్వు మనిషికి హుందాతనాన్నిస్తుంది. అందరూ హాయిగా వుండే ఆరోగ్యవంతమైన సమాజానికి బాటలు వేస్తుంది. అటువంటి రోజు కోసం చాలా మంది తమ నవ్వులను కూడా మర్చిపోయి, పోరాడుతున్నారు... త్యాగాలు చేస్తున్నారు. కొద్దిమంది శత కోటీశ్వరులు మాత్రమే నవ్వుకుంటే చాలదు. అందరూ ప్రశాంతంగా నవ్వుకోగలిగే సమాజం కావాలి. ప్రతి వ్యక్తి మోమున చిరునవ్వులు మెరవాలి. చైతన్యయుత సమాజం కోసం పోరాటాల సాగు చేస్తున్న వారికి ఈ చిరునవ్వులు ప్రేరణగా నిలవాలి. 'ప్రపంచ స్మైల్ డే'కు నిజమైన అర్థం అప్పుడే సిద్ధిస్తుంది.

అప్పుడు కూడా ...

అభివృద్ధి మా కేసి
కన్నెత్తి కూడా చూడదు కానీ
తుపాన్ల కెందుకో వల్లమాలిన ప్రేమ ?

అల్పపీడనం సవతితల్లి
నాలుగు చినుకుల్ని రాల్చిందని
ఊరట పడేలోపు
పెనుగాలుల ఉరితాళ్లను పేనుకొచ్చి
పచ్చని ప్రాణాలను ఉరితీసి పోతాయి

పడవలన్నీజి
తీరానికి కట్టేయబడిన పాడి ఆవులైనప్పుడు
నట్టింట్లో ఆకలి లేగదూడ మోరెత్తి
పేగులు తెగేలా అరుస్తూ వుంటుంది

వేల విధ్వంసపు చేతులతో
తుపానుజి
మా నవ్వు చేలన్నీ విరిచేసి వెళ్ళిపోయాక
మృత శిశువును కన్న
తల్లుల్లాజి
రిక్త గర్భాలతో నిలుచుంటామా..

థూ... ఈళ్ళ బతుకు చెడ..
అప్పుడు కూడా
మా పరిహారాల పాలబొట్లకూ
కక్కుర్తి పడ్డారు !

ఆన్‌లైన్ టు పొలిటికల్ లైన్ దుమారం

తెలుగువారు సినిమాను ఎంతో ప్రేమిస్తారు గనకే దేశం లోనే మొదటగా ఇక్కడే థియేటర్లు తెర్చుకున్నాయి. హిందీ పరిశ్రమ కూడా దీంతో విశ్వాసం తెచ్చుకుందంటున్నారు. వీటిని సంయమనంతో చర్చించుకుని సహేతుకమైన పరిష్కారానికి రావలసి వుంటుంది. పరిశ్రమపై ఆధారపడిన కళాకారులు, కార్మికుల శ్రేయస్సు, నిర్మాతలు పంపిణీదారులు ప్రదర్శనశాలల ప్రయోజనాలు, ప్రేక్షకులకు అందుబాటు అన్నిటినీ మించి మంచి సినిమాలు రావడం అందరి లక్ష్యం కావాలి. అదే సమయంలో దేశంలో సినిమా రంగం పైన, రచయితలు దర్శకుల భావప్రకటనా స్వేచ్ఛ పైన దాడుల గురించి చర్చ జరిగితే ప్రయోజనకరంగా ఉంటుంది. కరోనా నేపథ్యంలో మీడియా మనుగడ సవాళ్లను ఎదుర్కొంటున్నట్టే థియేటర్లకూ ఓటీటీకి మధ్య సినిమా రంగం చిక్కిపోయిన తీరును గతవారం శీర్షికలో చెప్పుకున్నాం. దానికి తగినట్టే ఈ వారమంతా సినిమా రాజకీయాలతో మీడియా, సోషల్ మీడియా హోరెత్తిపోయాయి. అయితే అటు సినిమాలపరంగా గానీ ఇటు రాజకీయంగా గాని వాస్తవాల లోతుల్లోకి పోకుండా కేవలం వివాదం పెంచుకోవడానికి, స్వప్రయోజనాలు సాధించుకోవడానికి వేర్వేరు శక్తులు, వ్యక్తులు పోటీ పడటం వల్ల ఈ చర్చ దారి తప్పింది. సినిమా టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం వెబ్ పోర్టల్ రూపొందిస్తుందని ఆగష్టు 31న జీవో 782 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదలచేసింది. హోంశాఖ కార్యదర్శి విశ్వజిత్ పేరిట విడుదలైన ఈ జీవో లో పోర్టల్‌ను టీవీ చలన చిత్ర అభివృద్ధి సంస్థ నిర్వహిస్తుందని పేర్కొంటూ ఎవరెవరు సభ్యులుగా వుంటారో వెల్లడించారు. ఈవార్త సెప్టెంబరు 9,10 తేదీలలో మీడియాలో వచ్చింది. ప్రభుత్వం చేయాల్సిన పనులు చాలా వుండగా ఈ సినిమా టికెట్ల వ్యవహారంలో తల దూర్చడమేమిటని వెంటనే విమర్శలు మొదలైనాయి. కొందరు దర్శక నిర్మాతలు కొన్ని సందేహాలు వ్యక్తంచేశారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇది పూర్తిగా పొరబాటనీ, అప్పుల పాలైన జగన్ ప్రభుత్వం సినిమా టికెట్ల డబ్బును ఈ వెబ్‌పోర్టల్ ద్వారా ముందు తన ఖాతాలో వేసుకుని మరిన్ని అప్పులు తెచ్చుకోవడానికి పూచీకత్తుగా వాడుకుంటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారికి అనుకూలమైనవిగా పేరొందిన ఛానళ్లు చర్చలు నడిపాయి. అపహాస్యం చేశాయి. ఈ పూర్వరంగంలో మంత్రి పేర్ని నాని పరిశ్రమ ప్రముఖులైన చిరంజీవి, నాగార్జున రాజమౌళి, దిల్ రాజు వంటి వారు ముఖ్యమంత్రి జగన్‌తో కొంతకాలం కిందట జరిపిన చర్చలలో చేసిన సూచన ప్రకారమే ఈ ఆన్‌లైన్ యోచన చేసినట్టు వెల్లడించారు. 2003 నుంచి ఇప్పటి వరకూ ఆన్‌లైన్ కోసం కేంద్రం రాసిన లేఖలు, రాష్ట్రంలో జరిగిన కసరత్తుల వివరాలు తేదీలతో సహా వెల్లడించారు. వాస్తవాలు తెలుసుకోకుండా గేలి చేయడంపై ఆగ్రహించారు.

పవన్ కళ్యాణ్ సభతో రసా'భాష'

లవ్‌స్టోరీ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పాల్గొన్న చిరంజీవి పరిశ్రమ చాలా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నదనీ, ప్రభుత్వాలు కరుణించాలని అభ్యర్థనగా మాట్లాడారు. ఆ తర్వాత రెండు రోజులకు – ఆయన మేనల్లుడు సాయిధరమ్ తేజ్ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో వున్న కారణంగా తన బదులు–రిపబ్లిక్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు హాజరైన పవన్‌కళ్యాణ్ ఇదే విషయమై ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. తనను దెబ్బ తీయడం కోసం వైసీపీ ఆన్‌లైన్ తీసుకొచ్చి మొత్తం పరిశ్రమను దెబ్బ తీస్తోందన్నారు. ప్రైవేటు రంగంలో తయారయ్యే సినిమాల టికెట్లపై ప్రభుత్వ పెత్తనం ఏంటని ఆక్షేపించారు. హీరోలు ఎంతో కష్టపడతారు గనక పారితోషికాలు భారీగా వుంటాయని సమర్థిస్తూ రాజకీయ నేతల అక్రమాస్తుల పైన మద్యం వ్యాపారం పైన ముందు దృష్టి పెట్టాలన్నారు. తనతో వకీల్ సాబ్ తీసిన దిల్ రాజును ఉద్దేశించి మీరూ మీరు ఒకే కులం గనక ప్రభుత్వానికి చెప్పండని ఎకసెక్కం చేశారు. ప్రభుత్వాన్ని సమర్థించే మోహన్‌బాబు వీటిని మాట్లాడాలన్నారు. చిరంజీవి వంటి వ్యక్తులు ప్రభుత్వాన్ని ప్రాధేయపడవద్దని చెప్పాలన్నారు. సంబంధిత మంత్రిని సన్నాసి అంటూ తీసిపారేశారు. మీడియా పైనా, 'మా' ఎన్నికల పైన వ్యాఖ్యలు చేశారు. జగన్‌పై విశాఖలో జరిగిన కత్తి దాడి, వివేకానందరెడ్డి హత్యకేసు దర్యాప్తు, లక్ష కోట్ల ఆరోపణలు ప్రస్తావిస్తూ సాగిన ఆయన సుదీర్ఘ ప్రసంగం తీవ్ర వివాదానికి దారితీసింది. సినిమా వేదికపై జనసేన అధినేతలా మాట్లాడటం, కులాల ప్రస్తావన, మంత్రిని సన్నాసి చేయడం వంటివి ఇందుకు కారణమైనాయి.

పరిశ్రమ చర్చలు, పవన్ రాజకీయాలు

మంత్రి పేర్ని నాని అదే స్థాయిలో స్పందిస్తూ పరిశ్రమ పెద్దల కోరిక మేరకు జరుగుతున్న కసరత్తుపై పవన్ దాడి చేయడాన్ని ఖండించారు. తను సన్నాసినైతే ఆయన సన్నాసిన్నర అంటూ కులాల ప్రస్తావనలూ కొనసాగించారు. ప్రభుత్వ విధానం వల్ల ఎ.పి లో సినిమాల ప్రదర్శనలు నష్టపోతున్నాయనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ఎ.పి లో 1100 పైన వున్న థియేటర్లలో 800 పైన నడుస్తున్నాయనీ, తెలంగాణలో 600 పైచిలుకులో 400 పైన మాత్రమే చిత్రాలు ప్రదర్శిస్తున్నాయని చెప్పారు. వసూళ్లు కూడా వకీల్‌సాబ్‌కూ, తాజాగా విడుదలైన లవ్‌స్టోరీకి ఎ.పి లోనే ఎక్కువ వాటా వచ్చిందన్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ కూడా పవన్ వ్యాఖ్యలతో విడగొట్టుకుంటూ వ్యక్తిగత స్పందనలకూ తమకూ సంబంధం లేదని ఇద్దరు ముఖ్యమంత్రులు సానుకూల చర్యలు తీసుకుంటున్నారని ప్రకటన చేసింది. పవన్ రాజకీయ విమర్శలూ హిందూ ఆలయాల కూల్చివేత వంటి అంశాలతో ట్వీట్లు కొనసాగించారు. కుక్కలను వదిలినట్టు వీరిని వదిలారని ఆయన అంటే...మంత్రి వరాహం అన్నారు. ఆ దశలో నటుడు పోసాని కృష్ణమురళి మరింత వికృతమైన భాషలోనూ వ్యక్తిగత ఆరోపణలతోనూ ముందుకు రావడం, పవన్ అభిమానులు ఆయనపై దాడి చేయడంతో చర్చ ఎక్కడికో పోయింది. మరోవైపున మంగళగిరిలో జనసేన విస్తృత సమావేశంలో పవన్ తాను కొందరు నిర్మాతలు అడిగితే మాట్లాడానని వివరణ ఇచ్చి సరిపెట్టారు. విశాఖలో తనను ఎంఎల్ఎ గా గెలిపించి వుంటే ఉక్కు ఫ్యాక్టరీ కోసం పోరాడేవాణ్నన్నారు. ప్రధాని మోడీ శక్తివంతుడైనా తనంటే ఎంతో అభిమానం అయినా ప్రజల కోసం ఆయనతో పోట్లాట పెట్టుకున్నానని కాని తనకు మద్దతు రాలేదని ఆరోపించారు. తను ఇక రాజకీయం చేస్తాననీ, వ్యూహం మారుస్తానని ప్రకటించారు. తెలుగుదేశంతో తిరిగి దగ్గర కావడమే కొత్త వ్యూహమని పలువురు అన్నారు గాని బద్వేల్ ఉప ఎన్నిక గురించి పవన్ బిజెపితో చర్చలు జరపడం కొసమెరుపుగా నిలిచింది. అదే సమయంలో నిర్మాతల బృందం మంత్రి పేర్ని నానిని కలిసింది. మీడియా గోష్టిలో మంత్రి ఎదురుదాడి కొనసాగిస్తూ పెద్దల కోరిక మేరకు ఆన్‌లైన్ విధానం ఆలోచించినట్టు చెప్పారు. వకీల్‌సాబ్ విషయంలో కొంత వివాదం వచ్చినా ఆన్‌లైన్ తాము కోరిన విధానమని దిల్ రాజు చెప్పారు.

సమస్య మూలాలూ, అనుభవాలు

ఆన్‌లైన్ ద్వారా టికెట్ల ధర అదుపు, అమ్మకం వివరాలు పారదర్శకంగా వుండటం, నిర్మాతకు వారి వాటా ప్రభుత్వానికి వినోద పన్ను సక్రమంగా చేరడం, బ్లాక్ నిరోధం, అవకతవకలు అరికట్టవచ్చుననేది ప్రధానాంశం. ఎ.పి ప్రభుత్వం నిర్ణయించిన టికెట్ల ధరలు మరీ తక్కువగా వున్నాయనీ వాటిని పెంచి ఆన్‌లైన్ పెడితే మంచిదేనని నిర్మాతలు అంటున్నారు. అయితే వచ్చిన డబ్బును ఎప్పటికప్పుడు ఇచ్చేయాలి గాని తన దగ్గర పెట్టుకుని ఆలస్యంగా విడుదల చేస్తామంటే తట్టుకోవడం కష్టమని వారి వాదనగా వుంది. 'బుక్ మై షో' వంటి ప్రైవేటు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎవరి వాటా సొమ్ము వారికి పోయినట్టే ఇకముందూ వుంటుందని పూర్తి వివరాలు తర్వాత అర్థమవుతాయని ప్రభుత్వం అంటున్నది. టికెట్ల ధర పెంపుపైనా పరిశీలనకు హామీనిస్తున్నది. తెలంగాణలో 2017 లోనే ప్రభుత్వ ఆన్‌లైన్ ప్రారంభమైనా థియేటర్లు దాంట్లో రిజిస్టర్ చేసుకోవడం తప్పనిసరి కాదు. అందరికీ వర్తింపచేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా 2019లో ప్రతిపాదించింది. కేరళలో నిర్మాతల మండలి స్వయంగా వెబ్‌పోర్టల్ నడుపుతున్నది. తమిళనాడు ప్రభుత్వం ఒక యాప్ అందుబాటులోకి తెచ్చింది.

ఎంత పెద్ద హీరోలైనా సినిమాలు వారంలోనే వందలాది థియేటర్లలో విడుదలై వసూళ్లు రాబట్టాలి గాని గతంలో వలె యాభై రోజులు, వంద రోజులు ఆడే పరిస్థితి ఇప్పుడు లేదు. కరోనాతో థియేటర్లు నెలల తరబడి నడవలేదు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆక్యుపెన్సీ చర్చలోనే వుంది. పైరసీ బెడద అంతకుముందే వుంది. 'ఓటిటి–ఆన్ ద టాప్' పేరుతో వచ్చిన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వంటివి సినిమాలు కొన్ని కోట్లు లాభం ఇచ్చి కొనేస్తున్నాయి. తెలుగు లోనూ 'ఆహా' వంటివి వచ్చాయి. చిన్న నిర్మాతలు, భిన్న దర్శకులు ఓటీటీని ఇష్టపడుతున్నారు. యాభై కోట్ల పైనే (ఒకరిద్దరికి వంద కోట్లు కూడా) హీరోల పారితోషికాలిచ్చి భారీ ఖర్చుతో తీసిన నిర్మాతలు థియేటర్లు ప్రధానంగా వుండాలని కోరుతున్నారు. మొదటి రెండు మూడు రోజులు ఎన్ని షోలైనా టికెట్లు ఎన్ని వందల రూపాయలైనా చూసేవారుంటే ప్రభుత్వం ఎందుకు అభ్యంతర పెట్టాలన్నది పవన్ వంటి వారి ప్రశ్న. అది ప్రేక్షకులను దోచుకోవడమేనని వైసీపీ నేతలు, మంత్రుల విమర్శ. మద్యం ఆన్‌లైన్ పెట్టేబదులు సినిమాలకు ఎందుకని సవాలు ప్రధానంగా వినిపించింది (దసరా తర్వాత మద్యం దుకాణాలు ఆన్‌లైన్ కావచ్చని ప్రభుత్వం హైకోర్టుకు చెప్పింది). పవన్ కళ్యాణ్ అసందర్భ ప్రసంగం ఒకటైతే పాలకపక్షం ప్రతిస్పందనా అలాగే వుండటంతో కులాల గురించి జుగుప్సాకరంగా చర్చ జరిగింది.

మంచి సినిమాలు, సృజన స్వేచ్ఛ

తెలుగువారు సినిమాను ఎంతో ప్రేమిస్తారు గనకే దేశం లోనే మొదటగా ఇక్కడే థియేటర్లు తెర్చుకున్నాయి. హిందీ పరిశ్రమ కూడా దీంతో విశ్వాసం తెచ్చుకుందంటున్నారు. వీటిని సంయమనంతో చర్చించుకుని సహేతుకమైన పరిష్కారానికి రావలసి వుంటుంది. పరిశ్రమపై ఆధారపడిన కళాకారులు, కార్మికుల శ్రేయస్సు, నిర్మాతలు పంపిణీదారులు ప్రదర్శనశాలల ప్రయోజనాలు, ప్రేక్షకులకు అందుబాటు అన్నిటినీ మించి మంచి సినిమాలు రావడం అందరి లక్ష్యం కావాలి. అదే సమయంలో దేశంలో సినిమా రంగం పైన, రచయితలు దర్శకుల భావప్రకటనా స్వేచ్ఛ పైన దాడుల గురించి చర్చ జరిగితే ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే షూటింగుల దశ లోనే దాడులు థియేటర్ల విధ్వంసం, బెదిరింపులు, ఒకసారి సెన్సార్ అయినా కేంద్రం రీసెన్సార్ అధికారానికి చట్టం చేయడం వంటి సమస్యలు చాలా తీవ్రమైనవి. కనక టికెట్లు వసూళ్లతో పాటు భావాలు, సృజనాత్మకత గురించి కూడా చర్చ జరగాలి. అన్ని దాడులను అడ్డుకోవాలి.

కాంగ్రెస్ పరిణామాలు

పంజాబ్ లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కాంగ్రెస్ పార్టీ బలహీనతను మరోమారు బట్టబయలు చేస్తున్నాయి. మరో ఏడాదిలో శాసనసభ ఎన్నికలు, ఆ తరువాత సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉండగా నూతన ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్ని, పిసిసి అధ్యక్షుడు నవజ్యోత్ సిద్ధు పీకల్లోతు అంత:కలహాల్లో మునిగిపోయారు. మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమైనారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన గుడ్‌బై చెప్పనున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఇది ఎక్కడికి దారి తీస్తుందో వేచి చూడాలి. ఆ పార్టీ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌ల లోనూ ఇదే స్థితి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రులపై కాంగ్రెస్ పార్టీలోనే ఇతర గ్రూపులు కత్తులు నూరుతున్నాయి. దీంతో కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ తరహా ఆధిపత్య పోరును అదుపు చేయడంలో అధినాయకత్వం వైఫల్యం చెందిన కారణంగానే మధ్యప్రదేశ్‌లో బిజెపి అధికారంలోకి రాగలిగింది. అసోంలోనూ ఇదే స్థితి. 2015లో అప్పటి ముఖ్యమంత్రి తరుణ్ గొగోరుతో ఉన్న గొడవల కారణంగా బయటకు వెళ్లిన హిమాంత బిశ్వశర్మ కాంగ్రెస్‌కు కొరకరాని కొయ్యగా మారారు. అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి పాగా వేయడానికి ఈ పరిణామం దోహదం చేసిందన్నది పరిశీలకుల అభిప్రాయం. ముఖ్యమంత్రి కుర్చీ కోసం జరిగిన పోరు బిజెపికి ఎలా లాభించిందో కర్నాటకలో ఇటీవలే చూశాం. సాక్షాత్తు కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోనూ కాంగ్రెస్ గ్రూపుల పోరు బిజెపికి లబ్ధి చేకూర్చేదిగా మారుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో!

ఒకప్పుడు జాతీయోద్యమానికి నాయకత్వం వహించి, స్వాతంత్ర్యాన్ని సాధించిన పార్టీగా ప్రజల్లో గుర్తింపు పొందిన కాంగ్రెస్ పార్టీ చేసిన స్వయంకృతాపరాధాలే ఆ పార్టీ ప్రస్తుత స్థితికి కారణం. జాతీయోద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యం పొందిన కొత్తలో అనుసరించిన కొన్ని ప్రజానుకూల విధానాలకు సైతం అనంతర కాలంలో ఆ పార్టీ చెల్లు చీటీ పాడింది. బ్యాంకుల జాతీయీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు, భూ పంపిణీ వంటి చర్యలకు భిన్నమైన విధానాల అమలు ప్రారంభించి కార్పొరేట్ల కొమ్ము కాసింది. ఇది అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి దారి తీయడంతో పాటు దేశాన్ని దివాళా దిశకు నడిపించింది. ఐ.ఎం.ఎఫ్ అప్పు మొత్తం దేశాన్ని నయా ఉదారవాద విష కౌగిలి లోకి నెట్టింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం వెర్రితలలు వేయడానికి, రాజకీయాలను కార్పొరేట్లు శాసించే స్థితికి దారి తీసింది. ఏ కార్పొరేట్ల సేవలో మునిగి ప్రజలను విస్మరించిందో, అవే కార్పొరేట్లు కాంగ్రెస్ పార్టీ కన్నా తమకు బిజెపియే బాగా కొమ్ము కాస్తుందని భావించాయి. ఫలితంగా కార్పొరేట్ – హిందూత్వ మతోన్మాద కూటమి ఇప్పుడు రాజ్యం ఏలుతోంది.తన వాగాడంబరంతో ప్రజలను మభ్య పెట్టి గద్దెనెక్కిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీపై ప్రజలు పెట్టుకున్న భ్రమలు తొలిగిపోతున్నాయని, ఆయన జనాదరణ గణనీయంగా తగ్గుతోందని వివిధ సర్వేలు చెబుతున్నాయి. వ్యవసాయ వ్యతిరేక చట్టాలపై దేశ వ్యాప్తంగా రైతాంగం నెలల తరబడి ఉద్యమిస్తున్నా మోడీ సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో రెండు రోజుల క్రితం జరిగిన దేశవ్యాప్త బంద్ తేటతెల్లం చేసింది. కరోనా వైరస్ నుండి ప్రజలకు రక్షణ కల్పించడంలోనూ, వ్యాక్సిన్‌ను విస్తృతంగా ప్రజలకు అందించడంలో మోడీ సర్కారు విఫలమైన తీరు ప్రజల కళ్లెదుట ఉంది. వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల కూడా ప్రజానీకం తీవ్రంగాస్పందిస్తున్నారు. భావోద్వేగ, విద్వేషపూరిత రాజకీయాల కన్నా మనుగడకుసంబంధించినదైనందినసమస్యలేప్రజలనుఎక్కువగాప్రభావితం చేస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వీఆర్ఏ మద్దాల రాజేష్‌కి నివాళులర్పించిన తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది

అవనిగడ్డ అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: గత రాత్రి మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం వద్ద కరకట్ట పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వి అర్ ఏ మద్దాల రాజేష్ మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని తెలిపారు. కొత్తపేట గ్రామానికి చెందిన అవనిగడ్డ వి అర్ ఏ మద్దాల రాజేష్ 40 బౌతిక కాయాన్ని అవనిగడ్డ తాసిల్ధారు శ్రీనివాస్ నాయక్. కార్యాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం నుండి మట్టి ఖర్చులు నిమిత్తం 15 వేల రూపాయలను తాసిల్దారు శ్రీనివాస్ నాయక్ సొంత ఖర్చులు నుండి ఐదు వేల రూపాయలను రాజేష్ కుటుంబ సభ్యులకు అందించారు. రాజేష్ కి భార్య ఇద్దరు కుమార్తెలు ఉండగా కుటుంబ యజమాని కోల్పోయిన వారి రోదనలతో ఆ ప్రాంతం విషాదఛాయలు అలుముకున్నాయి. రాజేష్ కుటుంబ సభ్యుల వారి పరిస్థితుల వివరాలు అడిగి తెలుసుకున్న తహశీల్దార్ ప్రభుత్వం నుండి అందువలన సహకారాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించి వారి కుటుంబంలో ఒకరికి రాజేష్ చేస్తున్నటువంటి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విఆర్ఓ శేషుబాబు. పి. డి. యస్. డిటి. లక్ష్మీ. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జైన్ దేవాలయాన్ని సందర్శించిన నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు

ఏలూరు అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: ఏలూరు నగరపాలక సంస్థ స్థానిక కుండి సెంటర్ లోని జైన్ దేవాలయని ఆదివారం నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు సందర్శించారు. దేవాలయం చేరుకున్న మేయర్ దంపతులకు జైన్ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయాని సందర్శించిన మేయర్ దంపతులు ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులను జైన్ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు నీతా విజయ్ కుమార్ జైన్,12వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, జైన్ సంఘం నాయకులు మూల్ చందు జైన్, ఉత్తమ్ చంద్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ సన్యాసం తీసుకోనున్న జేసీ..?

అనంతపురం, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: జేసీ దివాకర్ రెడ్డి ఎప్పుడూ బ్యాలన్స్ త ఎ ి ఎ మాట్లాడుతుంటారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తారు. ఇప్పుడు జేసీ కుటుంబం అధికారానికి దూరమయింది. పార్టీ కూడా వారిని దూరం పెట్టింది. దీంతో జేసీ దివాకర్ రెడ్డి లో వైరాగ్యం కన్పిస్తుంది. సమాజం, రాజకీయం అంతా చెడిపోయిందంటూ వేదాంత ధోరణికి వచ్చేశారు. జేసీ బ్రదర్స్ కు అధికారంలో ఉన్నప్పుడు సమాజం, రాజకీయం అనేవి కనపడలేదా? అని ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాల కాలాల నుంచి జేసీ దివాకర్ రెడ్డి రాజకీయాలు వెలగపెడుతున్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్లు బిల్డప్ ఇస్తున్నారు. ఇప్పుడు రాజకీయం ఏమాత్రం బాగా లేదంటున్నారు. సమాజం కూడా పూర్తిగా చెడిపోయిందన్న ధోరణికి వచ్చేశారు. చెడిపోయింది సమాజమా? లేక జేసీ రాజకీయమా? అన్న కామెంట్స్ బలంగా విన్పిస్తున్నాయి. దశాబ్దకాలాల వరకూ శాసించిన తాడిపత్రిని కోల్పోవడంతోనే జేసీ బ్రదర్స్ కు మతి చెల్లించిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.జేసీ దివాకర్ రెడ్డి కి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ తో పాటు అక్కడి రాజకీయాలు కూడా పడటం లేదు. ఇటు అధికారంలో ఉన్న వైసీపీ ఇబ్బందులు పెట్టడం, అటు సొంత పార్టీ అయిన టీడీపీలో తమకు మద్దతు కరువవ్వడంతో ఏపీని వదిలి తెలంగాణకు వస్తానని వ్యాఖ్యానించారు. అది సాధ్యమయ్యే పనేనా? తమకు పట్టున్న తాడిపత్రి ప్రాంతాన్ని వదిలి జేసీ కుటుంబం తెలంగాణకు షిఫ్ట్ అవుతామని చెప్పడం ఎవరిని బెదిరించడానికి?జేసీ దివాకర్ రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకున్నారు. వారి వారసులే ఇప్పుడు కొనసాగుతున్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలో టీడీపీ పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. వైసీపీ దెబ్బకు వచ్చే ఎన్నికల్లోనూ అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. మొన్నటి ఎన్నికల్లోనే దారుణ ఓటమిని చవి చూసిన జేసీ దివాకర్ రెడ్డి కుటుంబం టీడీపీ పట్టు సాధించేందుకు ఈ రకమైన వ్యాఖ్యలు చేశారా? అన్నది స్పష్టమవుతుంది. టీడీపీ అధినాయకత్వాన్ని బెదిరించేందుకే జేసీ దివాకర్ రెడ్డి ఈ కామెంట్స్ చేశారంటున్నారు. మొత్తం మీద జేసీలో వేదాంత ధోరణి తాత్కాలికమే. పొలిటికల్ గా రైజ్ అయిన వెంటనే ఆయనకు రాజకీయాలు, సమాజం అందంగా కన్పించవచ్చు.

కులం పేరుతో దూషించిన సాయి రెడ్డి మరియు అతని అనుచరులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నమోదు చెయ్యాలి

గోదా జాన్ పాల్ మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

గుంటూరు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం కారుచోల గ్రామాన్ని సందర్శించి మాట్లాడిన మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గోదా జాన్ పాల్ కారుచోల గ్రామంలో అగ్ర కులానికి చెందిన తాటిపర్తి సాయి రెడ్డి అనే వ్యక్తి రాత్రి పదకొండు గంటల సమయంలో మద్యం సేవించి తన బుల్లెట్తోపాటు %=%15బైక్ పై మరో ఇద్దరు కలిసి మాల పల్లెల్లోకి వెళ్లి ఆ సమయంలో పల్లెలోని బెంచీల మీద కూర్చున్న మాల యువకులని మాల నాకొడకల్లారా మాకు వ్యతిరేకమైన వ్యక్తుల వద్దకు పనికి వెళుతున్నారంట అలా వెళితే ఒకొక్కడు అంతు చూస్తానని ఈ రెండు సంవత్సరాలు మేము ఖోసె ఉఛ కూడా పెట్రోలై మండుతుందని ఎవడు ఏ పనికి వెళ్లిన సాయంత్రానికి హాజరుపట్టీలో సంతకం పెట్టాలని కాదని ఎవడు ఎదురుతిరిగిన ఒకమారు తన కారుతో గుద్ధి0చే ప్రయత్నం చేశాడని అటువంటి అటువంటి అహంకారి కుల ఉన్మాదిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం తో పాటు చంపుతానని బెదిరించడం అలాగే పల్లె లోకి అక్రమంగా ప్రవేశించి హుకుం జారీ చేయడంపై పలు కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. యడ్లపాడు ఎస్ఐ ని కలసి ఫిర్యాదు చేసిన వారిలో అంబడి పూడి నాగభూషణం మాల మహానాడు నరసరావు పేట డివిజన్ అధ్యక్షులు యడ? సురేష్ ,చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు సాతులూరి బసవయ్య, చావా సామెలు ,సునీల్,ముసలయ్యా తదితరులు వున్నారు....

రాష్ట్ర సాహిత్యా అకాడమి చైర్ పర్సన్ శ్రీమతి పిల్లంగోళ్ళ

ఏలూరు, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ లక్ష్మీ తండ్రి అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏలూరు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీ పిల్లంగోళ్ళ రంగారావు ఏలూరు క్రాంతి మండపం సంతాప సభ లో పాల్గొని నివాళులర్పించిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ శాసనసభ్యులు తలారివెంకట్రావు కొఠారు అబ్బాయుచౌదరి ఉన్నట్ల ఎలిజా గారు మాజి మంత్రి మరడాని రంగారావు కొఠారు రామచంద్ర రావు ఏలూరు కార్పొరేషన్ కార్పొరేటర్లు రాష్ట్ర వైయస్ ఆర్ సిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటి సభ్యులు డాః దుట్టా రామచంద్రరావు గారు.వైయస్ ఆర్ సిపి నాయకులు యాదవ సంఘీయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి గ్రామ నాయకులు ముందుండాలి: ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: గ్రామాల అభివృద్ధిలో గ్రామ నాయకులు ముఖ్య పాత్ర పోషించాలని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు ఆదివారం నరసరావుపేట మండలం, లింగం గుంట్ల అగ్రహారం గ్రామంలో జరిగిన ఎ ల ం అభివృద్ధి కార్యక్రమాల్లో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ. 22 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 18లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బాల వికాస్ వారు, ఎంపీ నిధులతో రూ.13 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ను, రూ. 40లక్షలతో నిర్మించిన రోడ్లను ..రాజ్య సభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి , ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు , నరసరావుపేట ఎమ్మెల్యే గోపి రెడ్డి శ్రీనివాస రెడ్డి , ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి , జెడ్పీటీసీ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ లావ్వు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడు తూ గ్రామ నాయకులు స్కూల్లో విషయంలోనూ రోడ్లల విషయంలోనూ ముందుండి పనులు చేపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలకు ఘాటుగ్గా సమాధానం చెప్పాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ ప్రజలకు అందుబాటులో ఉంటారని అభివృద్ధి పరంగా ఎమ్మెల్యే మీకు తోడుగా ఉంటారని అన్నారు. నిధులు తేవడంలో ముందుంటామని గ్రామాన్ని ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని అన్నా రు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తల్ను పాల్గొన్నారు.

వినుకొండ జాషువా కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

నరసరావుపేట, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: వినుకొండలో జరిగిన జాషువా కాంస్య విగ్రహావిష్కరణ లో నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిద: ం లం ౧ా పాల్గొన్నారం. జాషంవా సాంస్కృతిక సమాఖ్య వారి ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో నిర్వహించిన.. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం లో నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు , నరసరావుపేట , ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి , మాజీ శాసన సభ్యులు మక్కెన మల్లిఖార్జున కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎంపీ ప్రసంగించారు.

VISAKHAPATNAM
Jayalal
President
Dr. N. Subrahmanyam
Dr. D. Sreha
Dr. G. Nanda Kishore
Secretary IMA AP State

NATIONAL IMA PRESIDENT
VISIT TO IMA AP STATE
Chief Guest :
Date : 2nd Oct to 3rd Oct 2021
Venue : AMCOSA VISAKHAPA

వైద్యులపై దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలను తీసుకురావాలి:కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్

విశాఖపట్నం, అక్టోబర్,3 (ప్రజాపాలన బ్యూరో) :దేశం లో వైద్యుల పై దాడులను అరికట్టాలని, కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విశాఖ నగర వేదిక గా వైద్యుల సమస్య లపై సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ ఐ ఎం ఏ ఆధ్వర్యంలో ఆదివారం అంకోసా ఫంక్షన్ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మీడియా సమావేశం నిర్వహించింది.ఈ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జె. జయ లాల్, సెక్రటరీ జనరల్ డాక్టర్ జాయేష్ ఎం. లే లె ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ కష్ట కాలం లోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా పని చేసిందని కితాబు ఇచ్చారు. అదే సమయం లో కోవిడ్ సమయం లో భారత్ దేశ వ్యాప్తంగా వేలాది మంది డాక్టర్లు చనిపోయారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కోవిడ్ బాధితులకు సేవలు అందిస్తూ ఎంతో మంది డాక్టర్స్ అమరులు ఆవేదన వ్యక్తం చేశారు.విధి నిర్వహణ లో అసువులు బాసిన వారికి సంతాపం ప్రకటించారు. భారత దేశం లో మొట్ట మొదటి సారిగా మెడికల్ ఇన్సూరెన్స్ పేరు తో ఆరోగ్య శ్రీ ని ప్రవేశ పెట్టిన వై. ఎస్. రాజశేఖర్ రెడ్డిని గుర్తు చేసుకున్నారు. అయన ప్రవేశ పెట్టిన పథకం నేడు దేశ వ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. కార్గిల్ యుద్ధంలో 400 మంది సైనికులు మాత్రమే మరణించారని, కానీ కనిపించని శత్రువు వైరస్ తో పోరాడి వేలాది మంది వైద్యులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య డిగ్రీ, శిక్షణ, లైసెన్స్ లేకుండా దేశ వ్యాప్తంగా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్న వారిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.ఈ మీడియా సమావేశం లో ఏపీ ఐ. ఎం. ఏ. అధ్యక్షుడు డాక్టర్ ఎన్. సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నంద కిషోర్, ఎ. ఎం ఎస్ చైర్మన్ డాక్టర్ ఎ. శ్రీహరి రావు,, జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎం. వి విజయ శేఖర్, విశాఖ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్. పి. ఎ. రమణి, కార్యదర్శి డాక్టర్ ఫనెందర్, పాల్గున్నారు.

త్వరలో బోర్లకు మీటర్లు

శ్రీకాకుళం, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వ షరతులు రాష్ట్రంలోని రైతుల మెడకు చుట్టుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ బోర్లకు డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటలకు వినియోగిస్తోన్న భూగర్భ జలాలకు లెక్కగట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు ద్వారా ఇది అమలు కానుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన షరతుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగిస్తోన్న విషయం విదితమే. శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తి కాగా మిగిలిన జిల్లాల్లో అమలు చేస్తోంది. తాజాగా బోర్లకు నీటి మీటర్ల ఏర్పాటుతో రైతుల మెడకు మరో ఉచ్చు బిగిస్తోంది. నీటివనరుల విస్తరణ, నాణ్యత, లభ్యతను పెంపొందించడం లక్ష్యం అంటూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టును 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ప్రపంచ బ్యాంకు అప్పుగా ఇస్తోంది. దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలంటే రూ.3,680 కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా వేసి, ఇందులో 50 శాతం ప్రపంచ బ్యాంకు అప్పుగా ఇవ్వనుంది. ప్రాజెక్టు కాలపరిమితి 2016-17 నుంచి 2023-24 వరకు నిర్దేశించింది. 2016 ఏప్రిల్ ఆరో తేదీన మోడీ కేబినెట్ దీన్ని ఆమోదించింది. రుణం కోసం 2017 ఏప్రిల్ 14న ఒప్పందం కుదుర్చుకుంది. కాలపరిమితి సమీపిస్తుండడంతో దీని వేగవంతానికి బిజెపి ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ ప్రాజెక్టు అమలుపై ఆదేశాలు జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హైడ్రాలజీ ప్రాజెక్టును త్వరిగగతిన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి ఒక్కొక్క గ్రామం చొప్పున ప్రతిపాదనలు పంపాలని భూగర్భ జలశాఖ అధికారులను కోరింది. అందుకనుగుణంగా అధికారులు జాబితాలు రూపొందించి పంపుతున్నారు. పంటల సాగుకు రైతులు ఎంత మొత్తంలో నీటిని వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకేనని అధికారులు పైకి చెప్తున్నా, నీటి వాడకానికి పరిమితి విధించి, అంతకు మించి వాడితే డబ్బులు వసూలు చేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు కూడా డిజిటల్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. రోజుకు రెండు లక్షల లీటర్ల కంటే ఎక్కువ నీటిని తోడితే ప్రతి అదనపు లీటరుకూ ధర నిర్ణయించి వసూలు చేయనున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వి రాజులు వద్ద ప్రస్తావించగా, పరిశ్రమలకు ఫ్లో మీటరు బిగించుకోవాలని నోటీసులు ఇస్తారన్న విషయం తమకూ తెలిసిందన్నారు.వ్యవసాయ బోర్లకు డిజిటల్ ఫ్లో మీటర్ల ఏర్పాటుకు ప్రతి మండలం నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు రాగానే రైతుల అంగీకారంతో వీటిని బిగిస్తాం. భూగర్భ జలాల్లో హెచ్చుతగ్గులు, రైతులు ఎంత మొత్తంలో నీటిని వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు ఈ మీటర్లను బిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అమీర్‌పేట్ డివిజన్‌లో పలు కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి తలసాని

బాపునగర్ లో మెగా హెల్త్ క్యాంప్

అమీర్ పేట్, అక్టోబరు 03, ప్రజాపాలన ప్రతినిధి:బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ మరియు ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బాపునగర్ బస్తీ లోని మెగా హెల్త్ క్యాంప్ ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కరోనా వలన ప్రజలలో ఆరోగ్యం పై శ్రద్ద పెరిగిందన్నారు, ఇలాంటి మెగా హెల్త్ క్యాంపుల వల్ల అధిక ప్రయోజనం పేద ప్రజలకు దక్కుతుందని,,ఈ సందర్భంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వాహకులు ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ సిబ్బందిని అభినందించారు.ఈ క్యాంపు లో కార్డియాలజీ,న్యూరాలజీ,ఈ ఎన్ టి వంటి వివిధ విభాగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించగా, బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిసింగ్ జాదవ్ ఆధ్వర్యంలో బస్తీ వాసులు పెద్ద ఎత్తున ఈ మెగా క్యాంపు లో పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

స్థానిక వివేకానంద కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మంత్రి తలసాని పేద మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా అభివర్ణించారు, నాటి కాలంలో బతుకమ్మ పండుగ వస్తుందంటే రెండు నెలల ముందు నుండే సందడి కనిపించేదని నేడు అది కరువైందన్నారు,నేటి తరానికి మన పండుగల విశిష్టతను తెలియజేసే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు, బతుకమ్మ పండుగ మన ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన పండుగ అని, అందుకే మన ముఖ్య మంత్రి కేసీఆర్ ఆలోచన మేరకు ఆడపడుచులకు విశిష్టమైన బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వమే చీరల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు.జి హెచ్ ఎం సి ఆధ్వర్యంలో ఈ చీరలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట్ కార్పొరేటర్ కేతినేని సరళ,మాజీ కార్పొరేటర్ శేషు కుమారి,అమీర్ పేట్ డివిజన్ తెరాస అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్,జిహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్ బ్యూ 03 అక్టోబర్ ప్రజాపాలన : రైతులకు క్రాప్, ఎల్టి రుణాలు అందించడం కొరకు సరళీకృత విధానాలను అవలంభిస్తున్నామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని మేమిన్పేట్ మండల కేంద్రంలో గల ఏజెఆర్ వేడుక వేదికలో మోమిన్పేట్ పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన డిసిసిబి చైర్మన్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొసైటీ బ్యాంకులో జరిగే అన్ని లావాదేవీలు సభ్యులందరికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిరు వ్యాపారస్తులకు సొసైటీ బ్యాంక్ ద్వారా లోన్ కల్పించడం కోసం కొత్తగా పథకం మొదలు పెడుతున్నామన్నారు. సొసైటీ సభ్యులు అందరూ తప్పని సరిగా ఫిబ్రవరి నెలలో తమ వడ్డీ డబ్బులు చెల్లించాలన్నారు.ప్రాథమిక సహకార సంఘం నుండి వచ్చే సదుపాయాల పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సొసైటీ బ్యాంక్ సిబ్బంది రైతులకు సకాలంలో సహాయ సహకారాలందిస్తూ సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేకవనంపల్లి పిఎసిఎస్ చైర్మన్ అంజి రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మోమిన్పేట్ వైస్ చైర్మన్ బావోజి రాంచంద్రారెడ్డి, డైరెక్టర్లు అంజిరెడ్డి, బుచ్చిరెడ్డి, అశోక్ రెడ్డి, విజేందర్ రెడ్డి, భాగ్యమ్మ, మాన్యానాయక్, సొసైటీ సిఈఓ శేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి:

తహశీల్దార్ రవీందర్, ఎస్సై రాజు నాయక్

మల్లాపూర్, అక్టోబర్ 03(ప్రజాపాలన ప్రతినిధి):యువత గంజాయి వ్యసనానికి బానిసలు కాకుండా తమ బంగారు భవిష్యత్తు పై దృష్టి సారించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎస్సై రాజు నాయక్ కోరారు. మల్లాపూర్ మండలం వెంపెల్లి వెంకట్రావు పేట్ గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం యందు యువకులు, మైనర్లు గంజాయి మత్తుకు దూరంగా ఉండాలని యువత చెడు మార్గాల వైపు వెల్లదని మండల తహశీల్దార్ రవీందర్, ఎస్సై రాజు నాయక్ లు కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాల గురించి యువతకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ చెడు మార్గంలో ప్రయాణించకుండా చూస్తూ బంగారు భవిష్యత్తుకు భాటలు వేయాలని కోరుతూ, గంజాయి అక్రమ రవాణాను ఎవరు కూడా ప్రోత్సహించరాదని, గంజాయిని ఎవరైనా సరాఫరా చేస్తే పోలీస్ సిబ్బందికి అందజేయాలని, గంజాయి సరఫరా చేసే వారు ఎవరైనా కూడా కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇసుక గురించి ప్రయివేట్ వ్యక్తులు ఎవరైనా వేలం నిర్వహించరాదని ఒక వేళ ఎవరైనా అట్టి కార్యక్రమాలు నిర్వహిస్తే వారి వివరాలు తెలుపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బిట్ల సరోజన – నరేష్, జోగుల మమత – రాజేష్, ఎంపిటిసిలు తోట సుజాత – శ్రీనివాస్, గుగ్లవాత్ భూమి – రాజేందర్ గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా నియామకం అయిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు ఘనంగా సన్మానం



కోరుట్ల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని మినీ పద్మనాయక కల్యాణ మండపంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేశ్ అధ్యక్షతన జరిగిన జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం అనంతరం ఇటీవల టీటీడీ బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు నియామకం అయినా సందర్బంగా వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, కలెక్టర్ జి.రవి నాయక్, డీసీఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీపీ లు, జడ్పీ సీఈఓ సంధ్యారాణి, జిల్లా స్థాయి అధికారులకు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మల దగ్ధం

కోరుట్ల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి):కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో శనివారము హైద్రాబాద్ లో జరిగిన " విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్" కార్యక్రమం లో భాగంగా తెలంగాణా అమరవీరులకు నివాళులు అర్పించటానికి వెళ్ళిన తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ని హౌస్ అరెస్ట్ చేయడం, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాధుయాష్కీ గౌడ్ ని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని అక్రమ అరెస్ట్ చేయడానికి నిరసనగా, టీపీసీసీ పిలుపు మేరకు మరియు కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు ఆదివారం రోజున కేసీఆర్, మరియు కేటీఆర్ ల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సంధర్బంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎన్నికల హామీలలో నిరుద్యోగులగు ఉద్యోగాలని భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చిందని , ఇంటికో ఉద్యోగాన్ని ఇస్తానని హామీ ఇచ్చిందని, ఈపటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, విద్యార్థులని, నిరుద్యోగులను మోసం చేసిందని, తక్షణమే నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగులను భర్తీ చేయాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్ గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకటేష్ గౌడ్, తుపాకుల భాజన్న, మాజీ కౌన్సిలర్ సోగ్రాభి, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి మేకల నర్సయ్య, కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ రంజిత్ గుప్తా, పన్నాల అంజిరెడ్డి,లక్ష్మణ్ సుమన్, కోట గంగాధర్, గడెల అశోక్, వాసం అజయ్, శ్రీను, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం...

జగిత్యాల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అధ్యక్షతనలో నిర్వహించిన సమావేశంలో ముందుగా అగ్రికల్చర్ ఆర్టీకల్చర్ అంశాలపై విస్తృతమైన చర్చ కోనసాగింది. స్థానిక ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ అగ్రికల్చర్ శాఖపై మాట్లాడుతూ ఏవో ఏఈవో పూర్తి స్థాయిలో స్టాఫ్ ఉన్న కూడ రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడంలో కోంత అశ్రద్ధ కనబడుతుందని రైతుబంధు సమన్వయ సబ్యులకు సమాచారం ఇవ్వడంలో విఫలం అవుతున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సారంగాపూర్ మండల్ కొనపూర్ సహకార సంఘంలో కొంత మంది రైతులకు ఖాతాలో రుణమాఫీ జమ కాకపోవడంతో ఎమ్మెల్యే సంజయ్ అధికారులపై విరుచుకుపడ్డారు. కోతుల బెడదతో అడవి ప్రాంతంలో పండ్ల చెట్లు తునికి అల్లనేరడి తదితర చెట్లు నాటాలని కోరుట్ల ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్ రావుకు సూచించారు. విద్య వైద్యం పంచాయతీ రాజ్ మత్యుశాఖ తదితర అంశాలపై విస్తృతమైన చర్చ జరిగింది. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు టీటీడీ డైరెక్టర్ కావడంతో జడ్పీ ముగింపు తర్వాత జడ్పీ చైర్ పర్సన్ వసంత ఎమ్మెల్యే సంజయ్ జడ్పీటీసీ ఎంపీపీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి జడ్పీ సీఈవో సంధ్యారాణి డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి వివిధ మండలాల జడ్పీటిసిలు ఎంపీపీలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గాయత్రి షాపింగ్ మాల్ సకుటుంబ వస్త్రనిలయం

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్ బ్యూరో 03 అక్టోబర్ ప్రజాపాలన : స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకు ఉద్యోగ అవకాశాలను సృష్టించడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల రమేష్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పాతగంజ్ లో గాయత్రి షాపింగ్ మాల్ ను 28వ వార్డు కౌన్సిలర్ మోముల స్వాతి రాజ్ కుమార్, దుకాణం వ్యవస్థాపకుడు ధన్ రాజ్ చౌదరి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురు చూడకుండా స్వంతంగా వ్యాపారం చేపట్టడం ప్రశంసనీయమని కొనియాడారు.

నాణ్యమైన వర్ణశోభిత వస్త్రాలు మార్కెట్ ధరల కంటే సరసమైన ధరలకు అన్ని రకాల దుస్తులు లభిస్తాయని పేర్కొన్నారు. గాయత్రి షాపింగ్ మాల్ వ్యవస్థాపకుడు ధన్ రాజ్ చౌదరి మాట్లాడుతూ.. నవ యువతుల స్టైలీస్ సంచలనం, మహిళల మరో ప్రపంచంలోకి తీసుకెళ్ళే షాప్ అని అన్నారు. మా షాపులో ఎక్స్ క్లూజివ్ బ్రైడల్ వేర్, పట్టు శారీస్, డిజైనర్ శారీస్, గాగ్రాస్, చుడిదార్స్, డ్రస్ మెటీరియల్స్, పార్టీవేర్ లెహింగాస్, మెన్స్ వేర్, ఫార్మల్ సూట్స్, షేర్వాణి, ఫార్మల్ అండ్ క్యాజువల్స్, ఎత్నిక్ వేర్, బ్రాండెడ్ షర్టింగ్ అండ్ సూటింగ్, ఇన్న గార్మెంట్స్, ధోతి సెట్, జెంట్స్ ఆక్సెసరీస్, కిడ్స్ వేర్, ఫ్యాన్సీ ఫ్రాక్స్, గర్ల్స్ సల్వార్, స్కర్ట్స్ అండ్ లెగ్గింగ్స్, వెస్టర్న్ డ్రెసెస్, బాయ్స్ ఎత్నిక్ వేర్, డెనిమ్ ఫ్యాంట్స్, న్యూ బోర్న్ బేబి క్లాత్స్ లభించును అన్నారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు దేవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

7 వ వార్డులో టిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 7వార్డు సీతారాంపేట్ లో ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ శ్రీలత రాంబాబు, సింగిల్విండో చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి , మున్సిపాలిటీ రైతు నాయకులు జనార్దన్ రెడ్డి, వార్డు అధ్యక్షులు వంశీ కృష్ణ , ప్రధాన కార్యదర్శి రవీందర్ , వైస్ ప్రెసిడెంట్ శంకర్ , నరసింహ ,సురేష్, శ్రీకాంత్ , నాగరాజు , పెద్దలు లక్ష్మా రెడ్డి , రామ్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి , రామకృష్ణ రెడ్డి , యాది రెడ్డి , శంకర్ , గణేష్ , తదితరులు టిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు అల్వాల్ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముడుపు వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరగబడును.అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు తదితర అంశాలపై చర్చించి పార్టీ అభివృద్ధి చెందాలంటే ఐక్యమత్యంతో నాయకులు కార్యకర్తలు తోడ్పడాలని వార్డులలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరే విధంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించడం జరుగుతుంది.

టాటా మేజిక్ ఆటో జీబ్ యూనియన్ సభ్యులు..

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు వినతిపత్రం

జగిత్యాల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): బీర్పూర్ సారంగాపూర్ మండలాలకు చెందిన టాటా మేజిక్ ఆటో జీప్ యూనియన్ సభ్యులు 100 మంది ఆదివారం రోజున జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను కలిసి జగిత్యాల పాత బస్టాండ్ యూనియన్ బ్యాంక్ ఆవరణలో మూడు వాహనాలకు పార్కింగ్ అవకాశం కల్పించాలని వాహనాలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నామని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేయగా సానుకూలంగా స్పందించి అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా అధికారులు సానుకూలంగా స్పందదించారు. సత్వర పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి కోలుముల రమణ ఏఎంసి చైర్మన్ దామోదర్ రావు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చేతుల మీదిగా ప్రశంసా పత్రాలు అందజేత

కోరుట్ల,అక్టోబర్ ,03 (ప్రజాపాలన ప్రతినిధి):భారతదేశానికి స్వాతంత్రం వచ్చి డెబ్బై ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆజాదీ కా అమృత్ మహొత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారంకొరుట్ల పట్టణ పారిశుద్ధ్య కార్మికులకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్లవిద్యా సాగర్ రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందిచారు.ఈ కార్యక్రమం మున్సిపల్ ఛైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్, మునిసిపల్ కమీషనర్ ఎండి అయాజ్, వైస్ చైర్మన్ గడ్డమిది పవన్, శానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ చీరెలు పంపిణీ...

జగిత్యాల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని 12వ వార్డు గాంధీనగర్ లోని ఉప్పరిపేట్ యాదవ సంఘ భవనంలో బతుకమ్మ పండగ చీరలను స్థానిక కౌన్సిలర్ నక్క జీవన్ కుమార్ పంపిణీ చేశారు. మొదటి రోజు చీరల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుకుంటూ వార్డులోని ప్రతి ఒక ఆడపడుచుకు చీరలు అందాలని ఆర్పీ అంగన్వాడీలకు జీవన్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ జ్యోతి అంగన్వాడీ టీచర్ వైశాలి స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత...

సారంగాపూర్, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల్ కేంద్రానికి చెందిన సూర లచ్చన్న మనవరాలు రెండేళ్ల వయస్సు పుట్టినప్పటినుండి రెండు కాళ్ళు పనిచేయడం లేదు. తల్లి మతిస్థిమితం కోల్పోవడం కుటుంబం పూర్తిగా చిన్నాభిన్నం అయిపోయింది. పాపా అమ్మమ్మ తాత సమక్షంలో పెరుగుతూ వారి ఆర్థిక పరిస్థితి కూడ దినస్థితిగా ఉండడంతో పాపా చికిత్స కోసం బిజెపి మండల్ అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్ కుమార్ 5 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ అధ్యక్షుడు కలాగిరి మధు రెడ్డి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శాంతయ్య బీజేపీ సీనియర్ నాయకులు ఆనంతుల స్వామి మోహన్ ఉపేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లి రాజాగౌడ్ సుశీలమ్మ ప్రథమ వర్ధంతి

జగిత్యాల, అక్టోబర్ 03 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా లైబ్రరీ చైర్మన్ డా.చంద్రశేఖర్ గౌడ్ తల్లిదండ్రులు గొల్లపల్లి రాజాగౌడ్ సుశీలమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ జీఆర్ దేశాయ్ సతీష్ రాజ్ తదితరులు ఉన్నారు.

పిల్లలు ఇలా సురక్షితం...

పిల్లలకు కొవిడ్ సోకినా ఆ ఇన్‌ఫెక్షన్ ప్రాణాంతకంగా పరిణమించే అవకాశాలు తక్కువ. ఇది కొవిడ్ విషయంలో పిల్లలకు ఉన్న అడ్వాంటేజ్. అయితే మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం లాంటి కొవిడ్ నియమాలు పాటించడంలో పెద్దలతో పోలిస్తే, పిల్లల్లోనే అలసత్వం ఎక్కువ. ఇది కొవిడ్ విషయంలో పిల్లలకు ఉండే దుష్ప్రయోజనం. కాబట్టి ఇంటికే పరిమితమైన సమయంలో పిల్లలు ఎంత సురక్షితంగా ఉన్నారో, ఆరుబయట ఇరుగుపొరుగు పిల్లలతో కలిసి ఆడుకునేటప్పుడు, పెద్దలతో మసలేటప్పుడూ అంతే జాగ్రత్తగా వ్యవహరించేలా పిల్లలకు శిక్షణ ఇవ్వడం అవసరం.

మాస్క్ సౌకర్యవంతంగా...

పిల్లలకు కొవిడ్ నియమాల పట్ల అవగాహన ఉన్నా, వాటిని తూచతప్పక పాటించే విషయంలోనే తప్పులు చేస్తూ ఉంటారు. ఇంటి బయట అడుగు పెట్టబోయే ప్రతిసారీ మాస్క్ ధరించడం పిల్లలకు అలవాటు చేయాలి. ముఖ్యంగా మాస్క్ పిల్లలకు సౌకర్యంగా ఉండేలా పెద్దలు చూసుకోవాలి. మాస్క్ ముక్కును, నోటినీ సమంగా కప్పి ఉంచేలా ఉందో, లేదో చూసుకోవాలి. మాస్క్ జారిపోకుండా చెవులకు తగిలించే హ్యాంగర్ల ఎలాస్టిసిటీని పరీక్షించాలి. మాస్క్ ధరించేటప్పుడు, తీసేటప్పుడు వాటి హ్యాంగర్లనే తాకేలా పిల్లలకు శిక్షణ ఇవ్వాలి. పొరపాటున కూడా మాస్క్ ముందరి భాగాన్ని చేతులతో తాకకూడదని పిల్లలకు చెప్పడం అవసరం.

ఈ జాగ్రత్తలు కీలకం

పెద్దలతో పాటు పిల్లలు కూడా కొవిడ్ గురించి వింటున్నారు, చూస్తున్నారు. అయినా ఆ ఇన్‌ఫెక్షన్ కలిగించే ఆరోగ్య నష్టాలను వారికి వివరించడం పెద్దల బాధ్యత. ఎందుకు మాస్క్ ధరించడం అవసరమో, సామాజిక దూరం ఉపయోగాలేంటో పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి.

ఆరుబయట ఆడుకునే సమయాల్లో పిల్లలతో సన్నిహితంగా మెలగవద్దని పిల్లలకు చెప్పాలి. తినుబండారాలను తోటి పిల్లలతో పంచుకోవద్దని చెప్పాలి. ఆరుబయట ఆటలే తప్ప, తలుపులు, కిటికీలు మూసి ఉన్న ఇరుకు గదుల్లో ఆటలు ఆడుకోకుండా చూడాలి. తోటి పిల్లలతో అన్ని సందర్భాల్లో భౌతిక దూరం పాటించడం అవసరమని చెప్పాలి. వీలైనంతవరకూ పుస్తకాలు, పెన్నులు, బొమ్మలు, ఆటవస్తువులను తోటి పిల్లలతో పంచుకోకూడదని చెప్పాలి.

ఇల్లే బడి!

ఆన్‌లైన్ పాఠాలు మరికొంత కాలం పాటు కొనసాగబోతున్నాయి. దాంతో కంప్యూటర్లతో పిల్లలు గడిపే వేళలు పెరుగుతాయి. పెరిగే స్ర్కీన్ టైమ్ ప్రభావాలు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీయకుండా ఉండాలంటే తల్లితండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

యాంటీగ్లేర్: ఏ వయసు పిల్లలైనా ఆన్‌లైన్ పాఠాలు హాజరయ్యే సమయంలో తప్పనిసరిగా యాంటీగ్లేర్ కళ్లజోడు ధరించేలా చూసుకోవాలి. కళ్లు మండుతున్నట్టు చెప్పినా, నీరు కారుతున్నట్టు గమనించినా కళ్లు శ్రమకు గురవుతున్నాయని గ్రహించాలి. కళ్లు ఆర్పకుండా ఎక్కువ సమయం స్ర్కీన్లను చూడడం వల్ల కనుగుడ్లు పొడిబారతాయి. కాబట్టి తరచుగా కళ్లు ఆర్పడం మర్చిపోవద్దని పిల్లలకు చెప్పాలి.

ఒకే ప్రదేశం: డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్ ఎలాంటి కంప్యూటర్ వాడుతున్నా, ఆన్‌లైన్ పాఠాలకు హాజరయ్యే ప్రదేశం ఒకటే ఉండాలి. అలాగే కంప్యూటర్ టేబుల్, కుర్చీల ఎత్తులు సరిచూసుకోవాలి. పిల్లలు అవసరానికి మించి తలను ముందుకు చాపి పాఠాలు వింటున్నా, అవసరానికి మించి జారగిలబడి కూర్చున్నా శరీర భంగిమల్లో తేడాలు చోటుచేసుకుని మెడ, భుజాల్లో నొప్పులు తలెత్తవచ్చు.

నియమిత వేళలు: ఇంటిపట్టున ఉంటున్నా, బడి వేళల్లో భోజన సమయాలనే కొనసాగించాలి. బడికి వెళ్లే రోజుల్లో ఎలా సమయపాలనతో నడుచుకున్నారో దాన్నే ఇంట్లో కూడా పిల్లలు కొనసాగించేలా చూడాలి.

ఆహారం: ఇంటిపట్టున ఉంటున్న పిల్లల కోసం చిరుతిళ్లు అందుబాటులో ఉంచడం సహజం. అయితే వాటితో కడుపు నింపుకుంటూ పిల్లలు భోజనాలను మానేయకుండా చూసుకోవాలి. ఆకుకూరలు, కనీసం ఐదు రకాల కూరగాయలు, పళ్లు ప్రతి రోజూ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా ఆన్‌లైన్ ఆర్డర్లకు పిల్లలను దూరంగా ఉంచాలి.

వ్యాయామం: పిల్లలకు ఆటలతో వ్యాయామం దక్కుతుంది. అయితే ఇంట్లో ఆటలకు వీలుండదు కాబట్టి స్కిప్పింగ్, స్పాట్ జాగింగ్ లాంటి వ్యాయామాలు చేయించాలి. వీలైతే పిల్లల వ్యాయామాల్లో పెద్దలూ పాల్గొనాలి.

ఇండోర్ గేమ్స్: ఔట్‌డోర్ గేమ్స్ ద్వారా కొవిడ్ వ్యాపించే అవకాశాలు తక్కువ. కాబట్టి ఆటల విషయంలో వాటికే ప్రాధాన్యం ఇవ్వాలి.

సొంత వాహనాలు: సొంత కారు ఉంటే, దాన్ని ఇతరులకు అరువివ్వడం లాంటివి చేయకూడదు. కుటుంబసభ్యులు మినహా, ఇతరులకు కారులో చోటు కల్పించకపోవడమే ఉత్తమం. అలాగే క్రమంతప్పక కారు లోపలి భాగాలను శుభ్రం చేస్తూ ఉండడం కూడా అవసరమే!

ఈ మాస్క్‌లు ఉత్తమం

పిల్లలకు డిస్పోజబుల్ సర్జికల్ మాస్క్ లేదా మెల్ట్ గ్లోన్ లేయర్ కలిగిన మూడు పొరల క్లాత్ మాస్క్ వాడాలి. సర్జికల్ మాస్కుల్లో వైరస్‌ను అడ్డుకోగలిగే మెల్ట్ గ్లోన్ లేయర్ ఉంటుంది. ఒకవేళ క్లాత్ మాస్క్ వాడాలనుకుంటే, మెల్ట్ గ్లోన్ లేయర్ కలిగి ఉండే, మూడు పొరల మాస్క్‌నే పిల్లలు ధరించేలా చూసుకోవాలి. ఊపిరి వల్ల మాస్క్ లోపల తేమ చేరి, ఫంగస్, ఇతరత్రా సూక్ష్మక్రిములు పెరిగే వీలు కూడా ఉంటుంది. పైగా సూక్ష్మక్రిములు చేరడం వల్ల పిల్లలకు ఊపిరి పీల్చుకోవడంలో కూడా ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి మళ్లీ వాడే వీలున్న క్లాత్ మాస్క్‌లను తప్పనిసరిగా ప్రతి రోజూ శుభ్రం చేయాలి.

త్వరలో పిల్లల వ్యాక్సిన్

పెద్దలతో సమానంగా పిల్లలకూ కొవిడ్ వ్యాక్సిన్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఈ దిశగా ఇప్పటికే ప్రయోగాలు మొదలయ్యాయి. ఇప్పటికే అమెరికాలో 12 నుంచి 18 ఏళ్ల పిల్లల కోసం ఫైజర్, మోడర్నా వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. 3 నుంచి 12 ఏళ్ల మధ్య పిల్లలకు కూడా వ్యాక్సిన్ ట్రయల్స్ మొదలయ్యాయి. అక్టోబర్‌కి ట్రయల్స్ ముగిసి, ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. మన దేశంలో కూడా భారత్ బయోటెక్‌లో పిల్లల వ్యాక్సిన్ ప్రయోగాలు నడుస్తున్నాయి. ఈ ఫలితాలు కూడా అక్టోబరుకు వెల్లడవుతాయి. ఆ ఫలితాలను బట్టి దుష్ప్రభావాలు లేవని నిర్ధారించుకున్న వెంటనే ఈ వ్యాక్సిన్లు పిల్లలకు అందుబాటులోకి వస్తాయి.

ఎంతో కాలం సాగదు

వందేళ్ల క్రితం ఇన్‌ఫ్లుయెంజా ఎపిడమిక్‌ను ఎదుర్కొన్నాం. ఇది కూడా ఒకదానివెంట ఒకటిగా నాలుగు వేవ్‌ల రూపంలో వేధించి, నెమ్మదిగా సద్దుమణిగిపోయింది. కాబట్టి కరోనా వైరస్ విస్తృతి కూడా ఇదే తరహాలో సద్దుమణిగే వీలూ లేకపోలేదు.

అది అపోహ

రాబోయే థర్డ్ వేవ్ పిల్లలే లక్ష్యంగా దాడి చేస్తుందనే వార్తలు వింటున్నాం. కానీ ఇది నిజం కాదు. నిజానికి మొదటి, సెకండ్ వేవ్స్‌లో కూడా 8% నుంచి 10% మంది పిల్లలు కొవిడ్ బారిన పడ్డారు. మున్ముందు కూడా ఇదే తరహా పరిస్థితి ఉండవచ్చు. అంతే తప్ప పిల్లలే ఎక్కువగా ప్రభావానికి గురవుతారు అనేది అపోహ మాత్రమే!

డెల్టా ప్లస్ వేరియెంట్‌తో భయం వద్దు!

డెల్టా వేరియెంట్ కొవిడ్ సెకండ్ వేవ్‌కు కారణం. ఈ వేరియెంట్ గత ఏడాది దాడిచేసిన వైరస్ కంటే తీవ్రమైనది. మొదటి వేవ్‌లో 20 లేదా 30 నిమిషాలు కొవిడ్ సోకిన వ్యక్తితో గడిపినప్పుడే ఇతరులకు వైరస్ వ్యాప్తి ఉండేది. కానీ సెకండ్ వేవ్ వైరస్ తత్వం వేరు. ఈ డెల్టా వైరస్ అంతకంటే తక్కువ సమయంలోనే వ్యాప్తి చెందుతోంది. కుటుంబంలో ఒక్కరికి సోకినా, త్వరితంగా కుటుంబం మొత్తానికీ సోకుతోంది. మున్ముందు రాబోతున్న థర్డ్ వేవ్‌లో వైరస్ మునుపటి వైరస్‌ల మిశ్రమ వేరియెంట్. దీని పేరు డెల్టా ప్లస్. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వెలుగు చూస్తున్న డెల్టా ప్లస్ వేరియెంట్ తత్వం గురించిన పూర్తి సమాచారం అందుబాటులో లేదు. అయితే వ్యాధి నిరోధకశక్తిని దాటుకుని మరీ వ్యాధి గ్రస్థం చేసే సామర్థ్యం కొంతమేరకు ఈ వైరస్‌కు ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాబట్టి మరింత అప్రమత్తంగా నడుచుకోవాలి.

మధుమేహాన్ని ముందుచూపుతో...

రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా, మధుమేహ నిర్ధారణకు తక్కువగా ఉన్న స్థితిని ప్రి డయాబెటిక్‌గా భావించాలి. ఈ స్థితిని నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో టైప్2 డయాబెటిస్‌కు దారి తీయవచ్చు. ఇలా జరగకుండా ఉండాలంటే ఆహారంలో తగిన మార్పులు చేసుకోవాలి. ఇందుకోసం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచిస్తున్న మార్గదర్శకాలు ఇవే!

ఆహారం బరువును బట్టి: అధిక బరువు ఉన్నవాళ్లు తక్కువ కేలరీలు పొందే వీలున్న ఆహారం తీసుకోవాలి. శరీరం శక్తిని ఖర్చు చేసే తీరు ఆధారంగా, ఇతరత్రా ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని మాక్రోన్యూట్రియంట్లు సరిపడా అందే ఆహారాన్ని ఎంచుకోవాలి.

ఆహారం ఇలా: పీచు, విటమిన్లు, ఖనిజలవణాలతో పాటు, చక్కెర, సోడియం, కొవ్వులు తక్కువగా ఉండే పిండిపదార్థాలతో కూడిన ఆహారం ఎంచుకోవాలి. పిండిపదార్థాలు తగ్గించడం మూలంగా గ్లైసెమిక్ ఇండెక్స్ అదుపులో ఉంటుంది. పిండిపదార్థాలు, కేలరీల పరిమాణం పెరిగిపోకుండా చక్కెరతో కూడిన పదార్థాలు అరుదుగా తీసుకోవాలి.

చేపలు, మాంసం: చేపలు, లేత మాంసం, పప్పులు, బీన్స్, నట్స్ ఎక్కువగా, రెడ్ మీట్ తక్కువగా తీసుకోవాలి. రోజు మొత్తంలో పాల పదార్థాలు రెండు సార్లకు మించి తీసుకోకూడదు. ప్రి డయాబెటిక్స్ వృక్షాధార మాంసకృత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా శరీర బరువు పెరగకుండా నియంత్రించుకోవచ్చు.

కొవ్వులు: శరీరానికి అందే మొత్తం కేలరీల్లో కొవ్వులు 30శాతం, శాచురేటెడ్ ఫ్యాట్ 10శాతం ఉండేలా జాగ్రత్తపడాలి. ఇందుకోసం ఆరోగ్యకరమైన నూనెలను పరిమితంగా వాడుకోవాలి. నూనెలో ముంచి వేయించే పద్ధతులకు బదులు గ్రిల్, బేక్ లాంటి వంట ప్రత్యామ్నాయాలు ఎంచుకోవాలి.

స్నాక్స్: అనారోగ్యకరమైన స్నాక్స్‌కు బదులుగా గుప్పెడు బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, పిస్తాలు ఎంచుకోవాలి.

పీచు ఎక్కువ: ఆహారంలో ఎక్కువ పీచు, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం ప్రతి వెయ్యి కిలో కేలరీల్లో కనీసం 20 గ్రాముల పీచు ఉండేలా పదార్థాలను (పప్పుధాన్యాలు, బీన్స్, పళ్లు) ఎంచుకోవాలి.

ఉప్పు: ఉప్పు రోజుకు 2,300 మిల్లీగ్రాములు (ఒక టీస్పూను) మించకూడదు.

చక్కెర: తీపి పానీయాలకు బదులుగా నిమ్మరసం, మజ్జిగ, జల్‌జీరా, తాజా నీళ్లు తాగాలి

మీ షుగర్.. ఏ టైప్?

మధుమేహం.. అని యథాలాపంగా చెప్పేస్తాంగానీ, అందులో టైప్-1, టైప్-2 అని రెండు రకాలున్నాయి. వీటిలో టైప్-1 మధుమేహం పిల్లల్లో, యుక్తవయసువారికి, టైప్-2 మధుమేహం జీవనశైలి లోపాల వల్ల ఎక్కువగా 40 ఏళ్లు దాటినవాళ్లకి వస్తాయనే భావన ఉంది. కానీ.. యుక్తవయస్కులకు టైప్-2 మధుమేహం.. 45 ఏళ్లు దాటినవారికీ టైప్-1 మధుమేహం వస్తాయని తాజా పరిశోధనలో తేలింది. ఈ రెండు రకాల వారికీ చికిత్సావిధానం వేరుగా ఉంటుంది. అందువల్ల ఎవరికిఏ తరహా మధుమేహం ఉందనే విషయం సరిగ్గా తెలుసుకోవడం చాలా ముఖ్యం. అయితే ఈ విషయాన్ని నిర్ధారించటంలో కొన్నిసార్లు డాక్టర్లు కూడా పొరపాటు పడుతూ ఉంటారు. ఈ సమస్యను పరిష్కరించడానికి 'సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)'కి చెందిన డాక్టర్ చాదక్ నేతృత్వంలోని శాస్త్రవేత్తలు.. పుణేకి చెందిన కిమ్ ఆస్పత్రి, బ్రిటన్‌కు చెందిన ఎక్సేటర్ విశ్వవిద్యాలయం పరిశోధకులతో కలిసి అధ్యయనం చేశారు. ఒక వ్యక్తి టైప్-1 మధుమేహంతో బాధపడుతున్నాడా లేక టైప్-2తోనా? అనే విషయాన్ని జన్యువుల ద్వారా తెలుసుకోవచ్చని వారి అధ్యయనంలో తేలింది.

"ఇప్పటి దాకా మధుమేహాన్ని కలుగజేసే జన్యువులకు కనుగొనటానికి యూరోపలోని ప్రజల జన్యుక్రమాలను మాత్రమే ఉపయోగించేవారు. భారతీయులలో టైప్-1 మధుమేహం ఉందా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి కూడా ఆ ఫలితాలనే వాడేవారు. ప్రస్తుతం మన దేశంలో అనుసరిస్తున్న విధానాలన్నీ అలాంటివే! "తొలిసారి భారతీయులకు సంబంధించిన జన్యుక్రమాలను వాడి- జీన్ రిస్క్ స్కోర్‌ను రూపొందించాం. దీని ఆధారంగా టైప్-1 మధుమేహం ఉందా? లేదా అనే విషయాన్ని తెలుసుకోవచ్చు" అని ఆంధ్రజ్యోతికి ఈ పరిశోధనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ చాదక్ వివరించారు.

ఎలా చేశారు..?

డాక్టర్ చాదక్ బృందం పుణెకు చెందిన సుమారు 900 మంది జన్యుక్రమాలను సేకరించి విశ్లేషించింది. వారిలో టైప్-1, 2 మధుమేహ రోగులతో పాటుగా మధుమేహం లేని వారు కూడా ఉన్నారు. ఆ జన్యుక్రమాలను యూరోపలో జరిపిన వెల్‌కం ట్రస్ట్ కేస్ కంట్రోల్ కన్సార్షియం అధ్యయన ఫలితాలతో పోల్చి చూశారు. "మొత్తం తొమ్మిది జన్యు ప్రాంతాల్లో (వీటిని శాస్త్ర పరిభాషలో ఎస్ఎన్‌పీలు) తేడాలు ఉన్నాయని మా తులనాత్మక అధ్యయనంలో తేలింది. అంటే ఏ తరహా మధుమేహం అనే విషయాన్ని నిర్ధారించే సమయంలో ఈ జన్యుప్రాంతాలను విశ్లేషిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయి" అని చాదక్ వెల్లడించారు. తమ పరిశోధన వల్ల భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. "ఉదాహరణకు ఒక వ్యక్తికి ప్రాథమిక పరీక్షలు చేసి రక్తంలో గ్లూకోజ్ శాతం ఎక్కువ ఉందని నిర్ధారిస్తారు. ఆ తర్వాత టైప్-1 లేక టైప్-2 ఉందా అనే దానికి ప్రత్యేకమైన పరీక్షలు చేస్తారు. మా పద్ధతిలో- తొమ్మిది జన్యు ప్రాంతాలనూ విశ్లేషించే ఒక కిట్‌లో రక్తనమూనాను పెడితే- అది విశ్లేషించి.. టైప్-1 లేక టైప్-2నా అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. దీని వల్ల కచ్చితమైన చికిత్స, సులువుగా లభిస్తుంది" అని చాదక్ వివరించారు. ఈ కిట్‌ను తయారుచేయటానికి తాము పరిశోధనలు ప్రారంభించామన్నారు. - స్పెషల్ డెస్క్

టైప్-1.. టైప్-2.. తేడా ఏమిటి?

టైప్ 1 మధుమేహ రోగుల్లో ఇన్సులిన్ ఉత్పత్తి కాదు. ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే క్లోమంలో ఉండే బీటా కణాలపై రోగనిరోధక వ్యవస్థలోని కొన్ని కణాలు దాడి చేసినప్పుడు ఇన్సులిన్ ఉత్పత్తి చేసే వ్యవస్థ దెబ్బతింటుంది. ఇది సాధారణంగా చిన్నతనంలోనే బయటపడుతుంది. కొద్ది మందిలో ఇది వారసత్వంగా కూడా సంక్రమిస్తుంది. ఇక టైప్ 2 మధుమేహంలో శరీరం ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ దానిని శరీరం సరిగ్గా ఉపయోగించుకోలేకపోతుంది. సాధారణంగా జీవనశైలి సమస్యలు, ఊబకాయం, ఒత్తిడి వల్ల ఈ టైప్ మధుమేహం ఎక్కువగా వస్తుంది. ఇది సాధారణంగా 45 ఏళ్లు దాటిన తర్వాత బయటపడుతుంది. అయితే ఈ మధ్య కాలంలో చిన్న వయసు వారికీ టైప్-2 మధుమేహం వస్తోంది.

కొబ్బరినూనెతో ఇలా చేస్తే జుట్టే కాదు.. ముఖం కూడా మెరిసిపోతుంది!

కేరళలో కొబ్బరినూనెతో ఆహార పదార్థాలు చేస్తారు. ఆరోగ్యానికి ఎంతో మంచిదని నమ్ముతారు. అయితే చాలా దేశాల్లో కొబ్బరి నూనెను మాత్రం జుట్టు, చర్మ సౌందర్యానికి ఉపయోగిస్తారు. కొబ్బరినూనె పట్టిస్తే నిజంగా ముఖం నల్లగా అవుతుందా? ఇంతకీ కొబ్బరి నూనెను ముఖారవిందాన్ని మెరుగుపర్చుకోవాలంటే.. ఎలా ఉపయోగించాలి?

ముఖానికి కొబ్బరినూనె పూయాలా లేదా అనే సందేహం కలిగే ముందు.. ముందు మీ చర్మం పొడిగా ఉంటుందా? ఆయిలీ స్కిన్నా? అనే విషయం తెలుసుకోవాలి. ఆయిలీ స్కిన్ అయితే మాత్రం కొబ్బరినూనె పూయాల్సిన అవసరం లేదు. అయితే కొబ్బరినూనెను స్క్రబ్బర్‌గా ఉపయోగించుకోవచ్చు. దీనికోసం ఒక కప్పులో రెండు టీస్పూన్ల కొబ్బరి నూనె తీసుకుని అందులోకి ఒక టీ స్పూన్ చక్కెర వేయాలి. అది కూడా కాఫీ షాప్స్‌లో వాడే అతి చిన్న స్పటికాలుండే చక్కెర తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపాక.. ఆ మిశ్రమానికి ముఖానికి స్క్రబ్బర్‌లా పట్టించుకుని కడిగేయాలి. చర్మంలో మెరుపు వస్తుంది.

అర టేబుల్ స్పూన్ కొబ్బరినూనె, ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను ఒక కప్పులో తీసుకుని మెత్తగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాలయ్యాక మైల్డ్ సబ్బుతో ముఖాన్ని కడిగేయాలి. ఇలానే ఒక కప్పులో రెండు టీస్పూన్ల కొబ్బరినూనె తీసుకోవాలి. ఇందులోకి నాలుగు టీ స్పూన్ల అలొవెరా జెల్‌ను మిక్స్ చేయాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

ఒక కప్పులో టేబుల్ స్పూన్ కొబ్బరినూనె, టేబుల్ స్పూన్ పెరుగు, ఒక టీ స్పూన్ నిమ్మరసంను మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖంతో పాటు మెడ భాగానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరచాలి.

గుండె దడ తగ్గాలంటే...?

ప్రశ్న: మా నాన్నగారికి గత కొంత కాలంగా గుండె దడతో పాటు బీపీ కూడా ఉంది, ఈ మధ్య నీరసంగా ఉంటున్నారు. సరైన ఆహారం ద్వారా గుండె దడను తగ్గించవచ్చా?

– నాగపుష్ప, సికింద్రాబాద్

డాక్టర్ సమాధానం: దడ ఉన్న అన్ని సందర్భాల్లోనూ గుండెకు ఏదో సమస్య ఉందని కాదు. మానసిక, శారీరక ఒత్తిళ్లు, అనారోగ్యం, డీహైడ్రేషన్, అకస్మాత్తుగా లేవడం, నిలబడడం, కిందకు వంగడం, గుండెకు శ్రమను పెంచే వాటన్నిటి వల్ల కొన్నిసార్లు గుండె దడ రావచ్చు. ఒత్తిడిని నియంత్రించే మార్గాల ద్వారా కొంత వరకు గుండె దడను అదుపులో ఉంచవచ్చు. కేవలం దడగా అనిపించినప్పుడు మాత్రమే కాకుండా రోజంతా ప్రశాంతంగా ఉండేందుకు మార్గాలు ఎంచుకోవాలి. డీహైడ్రేషన్ ఉండకుండా చూసుకోవాలి. తప్పనిసరిగా రెండు నుంచి మూడు లీటర్ల నీటిని రోజూ తాగాలి. వేసవికాలంలో చెమట ద్వారా నీరు, ఖనిజ లవణాలను ఎక్కువగా కోల్పోతాం. కొబ్బరి బొండం నీళ్లు, ఉప్పు, చక్కెర వేయని నిమ్మకాయ నీళ్లు, పుచ్చ, కర్బుజా లాంటి పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. గుండె వేగాన్ని పెంచే కాఫీలు, టీలు, కూల్ డ్రింకులకు దూరంగా ఉండాలి. వయసుకు, ఎత్తుకు తగ్గ బరువును కలిగి ఉండేందుకు ప్రయత్నించాలి. రోజూ అరగంట పాటైనా తేలిక పాటి వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయడం మంచిది. దీనివల్ల గుండె కండరాలు బలపడి దడ నియంత్రణలోకి వస్తుంది. ఇన్ని పాటించినా గుండె దడ తగ్గకపోతే హృద్రోగ నిపుణులను సంప్రదించాలి.

రానా జోడీగా మలయాళ మనోహరి!

పవన్ కల్యాణ్ రీ ఎంట్రీ ఇస్తూనే 'వకీల్ సాబ్' వంటి రీమేక్ సినిమాతో హిట్ కొట్టేశారు. వసూళ్ల విషయంలో కొత్త రికార్డులను నమోదు చేశారు. ఆ తరువాత ఆయన మలయాళ మూవీ రీమేక్ గా 'భీమ్లా నాయక్' చేస్తున్నారు. ఈ సినిమాలో ఆయన పోలీస్ ఆఫీసర్ గా నటిస్తున్నారు. ఇక మరో ప్రధానమైన పాత్రలో రానా కనిపించనున్నారు. ఈ సినిమాలో పవన్ సరసన నాయికగా నిత్యామీనన్ ను తీసుకున్నారు. ఆమెకి సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణను కూడా పూర్తిచేశారు. ఇక రానా జోడీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించవలసి ఉంది.రానా జోడీగా ఐశ్వర్య రాజేశ్ ను అనుకున్నారు .. తీసుకున్నారు కూడా. అయితే ఆమె కాంబినేషన్లో సీన్లు వాయిదా వేయడం వలన మళ్లీ ఆమె డేట్లు సర్దుబాటు చేయలేకపోయింది. ఎందుకంటే ప్రస్తుతం ఆమె తమిళంలో నాయిక ప్రధానమైన సినిమాలు ఎక్కువగా చేస్తోంది. అందువలన ఆమె ఆ సినిమాలను పూర్తి చేయడం పైనే పూర్తి దృష్టి పెట్టింది.దాంతో అప్పటి నుంచి ఈ సినిమా కోసం చాలామంది కథానాయికల పేర్లను పరిశీలించారు. ఆ జాబితాలో తమిళ నాయికల పేర్లు ఎక్కువగా వినిపించాయి .. కానీ ఎవరూ కూడా సెట్ కాలేదు.ఈ నేపథ్యంలోనే మలయాళ మందారం 'సంయుక్త మీనన్'ను సంప్రదిస్తున్నట్టుగా వార్తలు వచ్చాయి. ఆమె ఈ సినిమా చేయడానికి అంగీకరించడం .. అగ్రిమెంట్ పై సైన్ చేయడం కూడా జరిగిపోయింది. ఈ సినిమాను తాను చేయనున్నట్టు ఆమె కూడా ధృవీకరించింది. పవన్ సినిమాలో .. రానా సరసన నటించే అవకాశం రావడం తన అదృష్టమని చెప్పింది. ఇంతవరకూ సంయుక్త మీనన్ తమిళ ... మలయాళ .. కన్నడ సినిమాలు చేస్తూ వచ్చింది. తెలుగులో ఆమె మొదటి చిత్రం 'బింబిసార'. ఈ సినిమాలో ఆమె కల్యాణ్ రామ్ సరసన కనిపించనుంది. ఆ సినిమా విడుదల కాకముందే ఆమెకి ఈ సినిమాలో ఛాన్స్ వచ్చేసిందన్న మాట.ఇక 'భీమ్లా నాయక్' కోసం రానా – సంయుక్త మీనన్ కాంబినేషన్లోని సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అలాగే పవన్ – రానా కాంబినేషన్ .. సముద్రఖని కాంబినేషన్ సీన్స్ కొన్ని బ్యాలెన్స్ ఉన్నాయని అంటున్నారు. వాటితో ఈ సినిమా షూటింగు పార్టు పూర్తవుతుందని చెబుతున్నారు. సాగర్ కె చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి తమన్ సంగీతాన్ని అందించాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు చెప్పారు. కానీ 'ఆర్ ఆర్ ఆర్' రిలీజ్ డేట్ దగ్గరగా ఉండటంతో 'భీమ్లా నాయక్' రిలీజ్ డేట్ వాయిదా పడే అవకాశాలు ఉన్నట్టుగా చెప్పుకుంటున్నారు.ఈ సినిమా తరువాత పవన్ .. క్రిష్ ప్రాజెక్టు 'హరి హర వీరమల్లు'పైకి వెళ్లనున్నారు. చారిత్రక నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఎ.ఎం.రత్నం ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. వజ్రాల దొంగగా ఈ సినిమాలో పవన్ కనిపించనున్నారని అంటున్నారు. మొగల్ చక్రవర్తుల కాలంనాటి కథ కావడంతో అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబించే భారీ సెట్లు ఆల్రెడీ వేయడం మొదలుపెట్టారు. పవన్ కెరియర్లోనే అత్యధిక బడ్జెట్ తో ఈ సినిమా రూపొందనుండటం ఆయన కెరియర్లోనే తొలి చారిత్రక చిత్రం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక రానా విషయానికి వస్తే ఆయన చేసిన 'విరాటపర్వం' విడుదల కోసం వెయిట్ చేస్తోంది. ఒక వెబ్ సిరీస్ తోను ఆయన బిజీ కానున్నారు.

బన్నీ కోసం ఇంట్రెస్టింగ్ లైన్ తీసుకున్న మురుగ.!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ప్రస్తుతం తన భారీ సినిమా "పుష్ప" చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే ఈ సినిమా అనంతరం మరిన్ని ఆసక్తికర సినిమాలను బన్నీ చెయ్యడానికి రెడీగా ఉన్నది. అయితే ఎప్పుడో బన్నీ కాంపౌండ్ నుంచి కోలీవుడ్ స్టార్ దర్శకుడు ఏ ఆర్ మురుగదాస్ తో సినిమా ఉందని కన్ఫర్మ్ అయ్యింది. కానీ అందుకు సమయం అనేది ఇంకా సెట్ అవ్వలేదు.కానీ ఇప్పుడు ఈ సాలిడ్ కాంబోపై ఇంట్రెస్టింగ్ బజ్ వినిపిస్తుంది. దాని ప్రకారం మురుగ ఈ సినిమా కోసం ఇంట్రెస్టింగ్ లైన్ ని ఎంచుకున్నారట. ఇది వరకు సామాజిక అంశాలతో ఆకట్టుకున్న మురుగదాస్ బన్నీ కోసం ఒక స్పైఫై జానర్ లైన్ ని ఎంచుకున్నాడట. ఇది కూడా భారీ లెవెల్లోనే ఉంటుందని తెలుస్తుంది. ఇది వరకు ఈ ఇద్దరి నుంచి కూడా ఇలాంటి తరహా సినిమా రాలేదు సో వీరి నుంచి ఇది కొత్త ప్రయోగమే అని చెప్పాలి. మరి ఈ టాక్ ఎంత వరకు నిజమో వేచి చూస్తే తెలుస్తుంది.

'నాట్యం' అంచనాలు పెంచే మరోటి..!

నాగ చైతన్యతో సుదీర్ఘ ప్రేమాయణం తర్వాత సమంత పెళ్లి పీటలు ఎక్కింది. పెళ్లి అయిన వెంటనే సమంత తన ట్విట్టర్ అకౌంట్ లో పేరులో అక్కినేని పదంను జత చేయడం జరిగింది. చాలా మంది పెళ్లి అయిన కూడా తమ పేరులో మార్చుకోలేదు. కాని సమంత మాత్రం తన పేరులో వెంటనే అక్కినేని పేరును జాయిన్ చేసి అందరి మనసులను దోచుకుంది. జంట అంటే ఇలా ఉండాలి అనేట్లుగా ఇద్దరు కూడా చాలా అన్యోన్యంగా ఉంటు అందరిని ఆకట్టుకున్నారు. పెళ్లి అయిన వెంటనే తన పేరులో అక్కినేని పేరును చేర్చుకుని అందరితో ప్రశంసలు అందుకున్న సమంత ఈమద్య కాలంలో తన పేరు నుండి అక్కినేని పదంను తొలగించడంతో చర్చ మొదలు అయ్యింది. కేవలం ఎస్ అనే అక్షరంతో మాత్రం ఆమె అకౌంట్ ఉంది.సమంత మరియు నాగ చైతన్యలు విడాకుల విషయం ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్విట్టర్ లో మళ్లీ మార్పు కనిపించింది. సమంత మళ్లీ తన అకౌంట్ పేరును మార్చింది. కేవలం ఎస్ అనే అక్షరం మాత్రమే ఉండగా ఇప్పుడు దాన్ని సమంత అంటూ మార్చింది. సమంతకు ముందు వెనుక ఏమీ లేవు. మొత్తానికి సమంత ఇంత స్పీడ్ గా పేరు మార్పులు కూడా చర్చనీయాంశం అయ్యింది. సమంత అకౌంట్ మార్పు విషయం కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగోతంది. సమంత ఇంత స్పీడ్ గా మారి పోతుందా అంటూ కొందరు అంటూ ఉంటే.. సమంత వెంటనే రివీల్ చేయకుండా చేసిన ప్రయత్నంను కొందరు అభినందిస్తున్నారు.నాగచైతన్యతో మొదటి నుండి చాలా ప్రేమతో ఉంటూ వచ్చింది. కలిసి ఉన్నన్ని రోజులు అతడికి ది బెస్ట్ ఇచ్చింది. అయితే ఇద్దరి మద్య చాలా పెద్ద విషయంలోనే విభేదాలు వచ్చి ఉంటాయి. అందుకే చాలా చర్చించుకుని కలిసి ఉండలేము అనే నిర్ణయానికి వచ్చి ఈ నిర్ణయం తీసుకుని ఉంటారు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట జరిగిన ప్రచారాలన్నింటికి తెర వేస్తూ వీరు క్లారిటీ ఇవ్వడంతో ఇంకా చర్చ లేకుండా పోయింది. వారు కలిసి ఉన్న నాలుగు సంవత్సరాలు కూడా నాలుగు వందల ఏళ్లు గుర్తు అన్నట్లుగా లైఫ్ ని ఎంజాయ్ చేశారు. గోవా.. మాల్దీవ్.. ఇంకా ఎన్నో హాలీడేస్ కు వెళ్లారు. ఇద్దరు కూడా జీవితాన్ని ఆస్వాదించారు. ఇప్పుడు ఇద్దరు వేరు వేరుగా మళ్లీ కొత్త జీవితాలను ప్రారంభిస్తారని ఆశిద్దాం.

రిపబ్లిక్" సినిమాపై నారా లోకేష్ కామెంట్స్!

SAI TEJ IN
DEV KATTA'S
REPUBLIC
OCT 1st
IN CINEMAS WORLDWIDE

మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ హీరోగా టాలెంటడ్ నటి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ చిత్రం "రిపబ్లిక్". విలక్షణ దర్శకుడు దేవా కట్ట అద్భుతమైన సామజిక అంశాలతో తెరకెక్కించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంటుంది. అయితే బాక్సాఫీస్ పరంగా పక్కన పెడితే సినిమాకి అప్లాజ్ మాత్రం సాలిడ్ గా వస్తుంది. మరి ఈ లిస్ట్ లో ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు తనయుడు నారా లోకేష్ కూడా చేరాడు.ఈ సినిమాపై తాను తాజాగా చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్ అవుతున్నాయి. "రిపబ్లిక్ సినిమా కోసం గ్రేట్ రివ్యూస్ వింటున్నాని, దర్శకుడు దేవా కట్ట, సాయి ధరమ్ తేజ్ ల అద్భుతమైన వర్క్ ని నేను కూడా వీలు చూసుకొని చూస్తాను. సాయి ధరమ్ తేజ్ త్వరగా తిరిగి కోలుకోవాలని కోరుకుంటున్నాను" అని నారా లోకేష్ సోషల్ మీడియా ద్వారా తెలియజేసారు. దీనిని బట్టి రిపబ్లిక్ సినిమా ఇంపాక్ట్ ఎలా ఉందో మనం అర్ధం చేసుకోవచ్చు.

'గాడ్ ఫాదర్' విషయంలో పూరి జోక్యం?



చిరంజీవి ఇప్పుడు వరుసగా భారీ సినిమాలను సెట్ చేసుకున్నారు. ఒక సినిమా తరువాత ఒకటిగా ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. అందుకు కావలసిన కసరత్తులు .. సన్నాహాలు ఒక రేంజ్ లో జరుగుతున్నాయి. కొరటాల దర్శకత్వంలో 'ఆచార్య' సినిమాను పూర్తిచేసిన చిరంజీవి పెద్దగా గ్యాప్ లేకుండా 'గాడ్ ఫాదర్' సినిమా కోసం సెట్స్ పైకి వెళ్లారు. మలయాళంలో భారీ విజయాన్ని సాధించిన 'లూసిఫర్' కి ఇది రీమేక్. ఈ కథను .. పాత్రను చిరంజీవి ఎంతగానో ఇష్టపడటం వలన ఈ ప్రాజెక్టు కార్యరూపాన్ని ధరించింది. ఇటీవలే ఈ సినిమా ఫస్టు షెడ్యూల్ షూటింగును మొదలు పెట్టింది.ఈ సినిమాకి తమిళ దర్శకుడు మోహన్ రాజాను తీసుకున్నారు. తెలుగు నేటివిటీకి తగిన మార్పులు చేసి రంగంలోకి దిగారు. అయితే స్క్రిప్ట్ కి సంబంధించిన ఈ మార్పులలో పూరి హ్యాండ్ కూడా ఉందనే టాక్ తాజాగా వినిపిస్తోంది. 'లూసిఫర్' కథ .. ఆ సినిమాలో మోహన్ లాల్ పాత్రను డిజైన్ చేసిన తీరు పూరికి బాగా నచ్చాయట. ఆ విషయాన్నే ఒక సందర్భంలో చిరంజీవితో చెప్పాడట. అంతేకాకుండా ఆ కథలో చిరంజీవిని ఎలా చూపిస్తే బావుంటుందనే అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. చిరంజీవికి గల క్రేజ్ కి తగినట్టుగా కొన్ని సీన్స్ ను తెరపై ఎలా ఆవిష్కరిస్తే బాగుంటుందనేది కూడా చెప్పాడు.అప్పటికే 'గాడ్ ఫాదర్' స్క్రిప్ట్ కి సంబంధించిన వర్క్ చాలావరకూ పూర్తయింది. అయినా పూరి ఇచ్చిన సలహాలు .. సూచనలు తనకి నచ్చడంతో చిరంజీవి అలాగే మార్పులు చేయించారని అంటున్నారు. అలా 'గాడ్ ఫాదర్' సినిమాలో పూరి జోక్యం ఉందని చెప్పుకుంటున్నారు. సాధారణంగా చిరంజీవి ఒక సినిమా చేయాలనుకుంటే కథ విషయంలో చివరివరకూ బెటర్మెంట్ ఉండేలా చూసుకుంటారు. ఇప్పటికీ ఆయన కొన్ని కథలపై పరుచూరి బ్రదర్స్ సలహాలు .. సూచనలు తీసుకుంటూ ఉంటారు. కథ మంచిగా రావడం కోసం అనుభవం ఉన్నవారు చెప్పిన విషయాలను తప్పకుండా ఆయన [illegible] తీసుకుంటారు.నిజానికి చిరంజీవి 150వ సినిమాను పూరి చేయవలసింది. 'ఆటో జానీ' టైటిల్ తో ఒక మాస్ కథను ఆయన అప్పట్లో చిరంజీవికి వినిపించారు. ఫస్టాఫ్ ను మించిన ఇంట్రెస్ట్ సెకండాఫ్ లో కలగకపోవడం అనే కారణంగా చిరంజీవి ఆ సినిమా చేయలేకపోయారు. అయితే ఎప్పటికైనా తాను చిరంజీవితో ఒక సినిమా చేసి తీరుతానని పూరి అన్నాడు. అలాంటి అవకాశం కోసం .. ఆయన నుంచి పిలుపు కోసం పూరి ఎదురు చూస్తున్నాడు. అయితే చిరంజీవి ఇటీవల బాబీ .. మెహర్ రమేశ్ వంటివారికి అవకాశాలు ఇచ్చారు. హరీశ్ శంకర్ కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నట్టుగా చెప్పుకుంటున్నారు.ఈ నేపథ్యంలో తన వైపు నుంచి ఆయనను ఒప్పించేందుకు పూరి ప్రయత్నాలు చేస్తున్నాడని అంటున్నారు. పైగా గతంలో మాదిరిగా ఒక సినిమాను సాధ్యమైనంత త్వరగా తీసేయాలనే హడావుడిని పూరి ఇప్పుడు చూపించడం లేదు. లేదంటే 'లైగర్' ప్రేక్షకుల ముందుకు వచ్చి కూడా చాలా రోజులయ్యేది. పూరి సరిగ్గా దృష్టి పెడితే ఏ రేంజ్ హిట్ ఇవ్వగలడనేది చిరంజీవికి తెలుసు. తెరపై ఎలాంటి విన్యాసాలు చేయించగలడనేది తెలుసు. ఆ నమ్మకంతోనే ఆయన చరణ్ ఫస్టు మూవీని ఆయన చేతిలో పెట్టారు. ఆ నమ్మకం పూరిపై ఆయనకి ఇప్పటికీ అలాగే ఉంది. అందువలన సరైన కథ పడితే ఆయనకి చిరంజీవికి ఛాన్స్ ఇచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.ప్రస్తుతం 'గాడ్ ఫాదర్బీ' చేస్తున్న చిరంజీవి ఆ తరువాత మెగర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళా శంకర్' .. 'బాబీ దర్శకత్వంలో 'వాల్తేర్ వీర్రాజు' సినిమాలు చేయనున్నారు. ఏ రెండు ప్రాజెక్టులతో వచ్చే ఏడాది గడిచిపోతుంది. ఇక పూరి ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా 'లైగర్' సినిమాతో బిజీగా ఉన్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే ఏ సినిమాపై అంచనాలు ఒక రేంజ్ లో ఉన్నాయి. మరి ఈ ఇద్దరి కాంబినేషన్లో ప్రాజెక్టు ఏదైనా సెట్ అవుతుందేమో చూడాలి.

bahujan bazaar బహుజన్ బజార్ bahujan bazaar
www.bahujanbazaar.in

మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝల్కరీ భాయీ చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మి భాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనికీ కారణం మన రచయితలను మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజన వాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు ఆర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

- అన్ని ప్రాంతాలు తిరుగకుండా ఇంటినుండే కొరుకున్న పుస్తకాన్ని ఇంటివద్దకు తెప్పించుకోవడం సులువవుతుంది. తద్వారా సమయం డబ్బు ఆదా అవుతుంది.
- మనవాళ్ళ బహుజన చరిత్ర తెలుసుకోవడం బహుజనాభివృద్ధికి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలల్లో తగిన విధంగా అవగాహనకు అవకాశం ఉంటుంది.
- బహుజనులకు సంబంధించిన రచయితలు ఎవరెవరు ఎక్కడ ఉన్నారు ఏమేమి రచయినలు చేసారో సులభంగా ఒకేచోట తెలుస్తుంది.
- బహుజన రచయితలు ఆర్థికంగా బలపడటం వల్ల పరిశోధనాత్మకత అభివృద్ధి (Research and Development) సాధ్యం అవుతుంది.

ఉచితం : రూ. 1000/- తో సభ్యత్వం తీసుకున్నవారికి సంవత్సర కాలములో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ. 500/-లకు పైన కొనగోలు చేసే పుస్తకాలపై కూడా రవాణా ఖర్చులు ఉచితం.

ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హాస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై పూలే, జై బహుజన

డాక్టర్ కె. శివ భాగ్యారావు బహుజన IRS-VRS
ఛైర్మన్, షిహ గ్రూప్స్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com